ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు



గగనంలో చలో చలో ఢిల్లీకి..



ప్రొటోకాల్‌లో భాగంగా తొలి విమాన సర్వీసుపై నీటిని వెదజల్లుతూ స్వాగతిస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి ఇండిగో తొలి విమాన సర్వీసుకు మొదటి టిక్కెట్టును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుమారుడు సంజీవ్‌కు అందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమానం

ప్రారంభమైన ఇండిగో ఫ్లైట్ సర్వీసులు

విమాన సర్వీసును ప్రారంభించిన కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు గురువారం ప్రారంభమయ్యాయి. మధురపూడిలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈ సర్వీసులను ప్రారంభించగా.. ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈనెల ఒకటిన ముంబైకి సర్వీసులు ప్రారంభమైన సంగతి తెలిసిందే.. - 6లో





గోదావరి పుష్కరాలపై ప్రస్తావన

ముఖ్యమంత్రితో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి.. ఐఏఎస్, ఐపీఎస్‌ల మీట్‌లో మన కలెక్టర్, ఎస్పీలు ప్రశాంతి, నరసింహకిషోర్

- ఘాట్ల నిర్మాణాలపై చర్చించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- సత్యసాయి వాటర్ స్కీమ్ పై కూడా కలెక్టర్ ప్రస్తావన
- ముగిసిన రెండురోజుల సదస్సు

రాజమహేంద్రవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాల 2027 ఆగస్టులో జరగనున్నందున దానికోసం గోదావరి గోదావరి ఘాట్లను అభివృద్ధి చేయవలసి ఉందని, రాజమహేంద్రవరం వైపు 4 కిలోమీటర్లు, కొవ్వూరు వైపు 3.5 కిలోమీటర్ల మేర ఘాట్లను అభివృద్ధి చేయవలసి ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై చంద్రబాబు వెంటనే స్పందించి దీనిపై చర్చించారు. అమరావతిలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రెండురోజులపాటు జరిగిన కలెక్టర్ల సదస్సులో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ ప్రశాంతి జిల్లాకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. గోదావరి ఘాట్లను ఏ శాఖ నిర్వహిస్తున్నది.. ఇరిగేషనేనా, ఇతర పనులు గతంలో ఎవరి ఆధ్వర్యంలో జరిగాయని చంద్రబాబు ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఘాట్లను ఇరిగేషన్ శాఖ నిర్మిస్తే, పుష్కర ఏర్పాట్లన్నీ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జరిగినట్టు చెప్పారు. అయితే ఈసారి కూడా గతంలో మాదిరిగానే ఆయా శాఖల ఆధ్వర్యంలోనే నిర్వహిద్దామని చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. దీంతో కాసేపు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పి.నారాయణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మధ్య చర్చ జరిగింది. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ శ్రీ సత్యసాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీటి పథకం నిర్వాహకులు, సిబ్బందికి వేతనాలు చెల్లింపు, పీఎఫ్ చెల్లించకపోవడం వల్ల పథకం అమలులో సమస్యలు వచ్చాయని, తాళ్లపూడి మండలంలో మంచినీటి సమస్య ఉందన్నారు. సీఎం చంద్రబాబు స్పందించి మంత్రిని వివరణ అడిగారు. కాసేపు చర్చ జరిగింది. ఎలా అమలు చేయాలనేదానిపై సమీక్షించారు. మళ్లీ కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు మెట్ట ప్రాంతాలకు గత రెండు దశాబ్దాలుగా మంచినీటి ఈ పథకం ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. 2021 నుంచి సకాలంలో జీతాలు చెల్లించకపోవడం వల్ల సిబ్బంది సమ్మె దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు. ఇక ఆక్వా ఉత్పత్తుల సాగు పద్ధతులు, వినియోగం, మార్కెటింగ్, ల్యాండ్ కన్వర్షన్ తదితర అంశాలను కూడా కలెక్టర్ ఈ సదస్సులో ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, యువతకు ఆయా విభాగాల్లో నైపుణ్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. లోతట్టు, ముంపు ప్రాంతాల్లో రైతులు దిగుబడి తక్కువగా వస్తుందని చెబుతున్నారని, ఆయా భూముల్లో పీహెచ్ పరీక్షలు నిర్వహించవలసి ఉందన్నారు. ఏడాదికి ఏడాదికి దిగుబడి తగ్గుతున్న దృష్ట్యా ఆయా భూయజమానులు ల్యాండ్ కన్వర్షన్ కోసం కోరుతున్నారన్నారు. పీహెచ్ పరీక్షలు కోసం ప్రభుత్వపరంగా చేయూత అవసరమని, ప్రైవేట్ వ్యక్తులు రూ.20 వేల నుంచి 25 వేల రూపాయల వరకూ తీసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వపరంగా చేయూత ఇవ్వడానికి యువతలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు అకడమిక్ బోధనతోపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, రెండు మూడు బ్యాచ్‌లను తయారుచేసి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పరీక్షలు నిర్వహించ వచ్చన్నారు. ఆక్వా కల్చర్‌కు అంతర్జాతీయ మార్కెట్‌ను ప్రోత్సహించడానికి ధరల స్థిరీకరణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ కోరారు. తర్వాత సీఎం చంద్రబాబునాయుడుతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ ఇద్దరూ సంయుక్తంగా పాల్గొన్నారు.

గ్రీన్ సిగ్నల్!



భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైనుకు మోక్షం

నిర్మాణానికి రూ.2 వేల 155 కోట్లు

ఎంపీ పురందేశ్వరికి రైల్వే మంత్రి లేఖ

ఇన్నాళ్లు స్థానికులు పడిన కష్టాలకు తగిన ఫలం

ఏజెన్సీ మీదుగా ఇక రైలు కూతలే

కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైనుకు కేంద్రం తగినంత బడ్జెట్ కేటాయించింది. చిన్నపాటి మార్పులతోనే ఈ రైల్వే మార్గం పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేశారు. రాబోయే ఐదేళ్లల్లోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సంకల్పించారు. భారీ అంచనా వ్యయంతో ప్రాజెక్టు మంజూరు చేస్తున్నట్టుగా రైల్వే మంత్రి రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరికి రాత పూర్వకంగా తెలిపారు. ఏజెన్సీ మీదుగా సాగే ఈ రైల్వే మార్గం పూర్తయితే దూర భారం తగ్గుతుంది.

(ఆంధ్రజ్యోతి- ఏలూరు/కొవ్వూరు)

కొవ్వూరు-భద్రాచలం రైల్వే మార్గం విషయంలో సర్వేల పేరిట దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగానే కాలయాపన జరిగింది. కొవ్వూరు-భద్రాచలం మధ్య అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండడం, రైల్వే లైను నిర్మించాలంటే కొండ వాగులు, పిల్ల వాగులపై దాదాపు 120 చోట్ల బ్రిడ్జిలు కట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రాజెక్టు వ్యయంలో సగభాగం వీటి నిర్మాణానికే ఖర్చయ్యేది. అందుకనే రైల్వే మంత్రిత్వ శాఖ ఈ రైల్వే మార్గంపై సర్వేలతోనే సరిపుచ్చింది. తొలిసారిగా 1960లో సర్వే సాగింది. ఈ మార్గంకు ఉన్న ప్రాధాన్యతను అప్పుడు జరిగిన సర్వేలో నివేదించారు. అయినా రిజర్వు ఫారెస్టు భాగం ఎక్కువగా ఉండడంతో అటవీ, పర్యావరణ అనుమతులు తప్పవని, దీనికి భిన్నంగా ఏదైనా ఆలోచన చేయవచ్చునన్న ధోరణిని రైల్వేశాఖ ప్రదర్శిస్తూ వచ్చింది. ప్రతీ బడ్జెట్‌లోను ఈ రైల్వే లైను ప్రస్తావన సాగుతున్నా బడ్జెట్‌లో రూపాయి విదల్చడంలేదు. గడిచిన పదేళ్లుగా కేవలం సర్వే, ఇతర పనుల నిమిత్తం రూ.40 కోట్లకు వరకు కేటాయించారు. ఈ స్వల్ప బడ్జెట్ కేటాయింపులతో రైల్వే ప్రాజెక్టుకు నీళ్ళొదులుకోవాల్సిందేనని అందరూ భావించారు. గతంలో ఎంపీలుగా ఉన్న వారంతా ఈ రైల్వే లైను కోసం పార్లమెంటులో పట్టుపడుతూ వచ్చారు. ప్రధాని దగ్గర నుంచి రైల్వేమంత్రి వరకు వినతులు అందజేశారు. అయినప్పటికీ రైల్వే శాఖ మాత్రం చూద్దాం.. చేద్దాం అన్నట్టుగానే వ్యవహరించింది. ఈ పరిస్థితులపై రాష్ట్రం- రైల్వే జనరల్ మేనేజర్‌తో ఏటా జరిగే కో-ఆర్డినేషన్ కమిటీల్లో ప్రస్తావనకు తెచ్చేవారు. ఈ క్రమంలోనే గత దశాబ్దకాలంగా తెలంగాణ రాష్ట్ర పరిధిలోని సత్తుపల్లి పరిసరాల్లో బొగ్గు నిక్షేపాలు బయటపడ్డాయి. దీంతో సింగరేణి కాలరీస్ పరిధిలోకి ఈ భూభాగమంతా చేరింది. అప్పటి నుంచి బొగ్గు తవ్వకాలు కాస్తంత వేగం పుంజుకున్నాయి. ఈ తరుణంలో సత్తుపల్లిలో లభించే బొగ్గును ఇతర ప్రాంతాలకు తరలించాలంటే రైల్లే అనుకూల రవాణా. దీంతో కొత్తగూడెం-సత్తుపల్లి మధ్య కాస్ట్ టూ కాస్ట్ షేరింగ్ పద్ధతిలో సింగరేణి యాజమాన్యం రూ.706 కోట్లు ఖర్చు భరించగా, సౌత్ సెంట్రల్ రైల్వే తన వాటా రూ.85 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. దీంతో పనులన్నీ పూర్తయ్యి సత్తుపల్లి- కొత్తగూడెం మధ్య రైల్వే మార్గం క్లియర్ అయ్యింది. ఇప్పుడు కొవ్వూరు-సత్తుపల్లి మధ్య రైల్వేలైను నిర్మిస్తే కొంత ప్రతిపాదిత వ్యయం తగ్గడమే కాకుండా రాబోయే ఐదేళ్లల్లోనే పనులు పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు- భద్రాచలం రోడ్డు లైను నిర్మాణానికి వీలుగా 2 వేల 155 కోట్లు ప్రతిపాదిత వ్యయం గుర్తించి మంజూరు చేస్తున్నట్టు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి రాతపూర్వకంగా తెలిపారు. ఇన్నాళ్లు రైల్వే బడ్జెట్‌లో ఈ తరహా పద్దు ఎక్కడా కనిపించకపోగా ఇప్పుడు తాజాగా రైల్వే మంత్రి వైష్ణవ్ నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించడంతో హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకించి ఈ రైల్వే మార్గం నిడివి 165 నుంచి 119 కిలోమీటర్లకు తగ్గింది కూడా. అలాగే కొంత అలైన్‌మెంట్‌లో మార్పులు, చేర్పులు చేసి సత్తుపల్లి-దేవరపల్లి వరకు ఇప్పటికే గ్రీన్‌హైవే నిర్మిస్తున్నందున దానికి సమాంతరంగా కొత్త రైల్వే లైనుకు దాదాపు రూటు క్లియర్ అయినట్టే. ఎప్పటినుంచో ఈ లైను కోసం పోరాడుతున్న వారికి తాజా బడ్జెట్ కేటాయింపు నిర్ణయం సంతృప్తినిచ్చింది. ఇంతకుముందున్న పరిస్థితులు మారి ఇప్పుడు టి.నర్సాపురం, పుట్టగట్లగూడెం మీదుగా ఈ రైల్వే లైను వెళ్లబోతోంది.



మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

మృతికి వైద్యులే కారణమంటూ గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన

గోకవరం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మళ్లీ అదే తీరు.. అదే నిర్లక్ష్యం. అప్పుడు నిండు గర్భిణీ మృతి చెందగా, తాజాగా మరో వ్యక్తి ప్రాణాలు విడిచాడు. అయినప్పటికీ ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదు. గోకవరం ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. ఆసుపత్రికి ఏ డాక్టర్ ఎప్పుడు వస్తారో, ఎంత సమయం వరకు ఉంటారో ఎవరికీ తెలియదు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే సిబ్బంది కనిపించడం లేదు. గత నెల నవంబరు 23న ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిన నిండు గర్భిణీ పుట్టిన బిడ్డను కూడా చూడకుండానే ఇదే ఆసుపత్రిలో మృతి చెందింది. ఆసమయంలో గర్భిణీ మృతిపై మృతురాలు బంధువులు నోరు మెదపనప్పటికీ, బయట వ్యక్తుల నుంచి మాత్రం వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె ప్రాణాలు విడిచిందనే ఆరోపణలు వినిపించాయి. ఇప్పుడు తాజాగా అటువంటి ఘటనే ఈ ఆసుపత్రిలో చోటు చేసుకొంది. గోకవరంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన కాళ్ళ రాజమల్లి (35) అనే వ్యక్తి కుటుంబ తగాదాల కారణంగా గురువారం తెల్లవారుజామున ఇంటి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది బాధితుని పట్ల నిర్లక్ష్యమైన ధోరణి ప్రదర్శించారని, కనీసం ప్రథమ చికిత్స కూడా అందించకుండానే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించాలని తెలిపినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు రాజమల్లిను ప్రైవేట్ వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసికెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు రాజమల్లి మృతదేహంతో తిరిగి గోకవరం ప్రభుత్వాసుపత్రికి చేరుకొని ఆందోళనకు దిగారు. సక్రమంగా వైద్యం అందకపోవడంతోనే రాజమల్లి మృతిచెందాడని, అతడి మృతికి కారకులైన వైద్యులు, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ పట్టుబట్టారు. కనీసం బాధితుడు చెయ్యి పట్టుకునే ప్రయత్నం కూడా వైద్యులు చేయలేదంటూ మృతుని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో ఆసుపత్రి వద్ద జన సమూహం విపరీతంగా పెరగడంతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో చివరకు పోలీసులు రంగంలోకి దిగి అప్పటికే పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆసుపత్రికి వచ్చిన డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీరాణితో పోలీసులు చర్చలు జరిపారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి తద్వారా బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. రాజమల్లికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సదస్సుల సందడి

- జిల్లాలో 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
- తొలిరోజు 386 అర్జీలు స్వీకరణ
- రాజమండ్రి డివిజన్‌లో 149, కొవ్వూరు డివిజన్‌లో 237 అర్జీలు
- కొవ్వూరులో 42 అర్జీలు అక్కడికక్కడే పరిష్కారం

(రాజమహేంద్రరం -ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రెవెన్యూ సదస్సులు సందడిగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జిల్లాలో 23 చోట్ల రెవెన్యూ సదస్సులు నిర్వహించి అక్కడ ప్రజల ద్వారా 386 అర్జీలు స్వీకరించినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రాజమండ్రి డివిజన్ నుంచి 149 అర్జీలు స్వీకరించారు. కొవ్వూరు డివిజన్ నుంచి 237 అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా రీసర్వేకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. ఇతర సమస్యలకు సంబంధించి రాజమండ్రి డివిజన్‌లో 83, కొవ్వూరు డివిజన్‌లో 101 అర్జీలురాగా, కొవ్వూరులో 42 అర్జీలు అక్కడికక్కడే పరిష్కరించడం గమనార్హం. ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్ కులధ్రువీకరణ పత్రాల్లో పేరు మార్పులు, రికార్డు ఆన్ రైట్స్ (ఆర్వోఆర్)కు, 22ఏ నుంచి మినహాయింపు, భూమి తగాదాలు వంటివి ఎక్కువ వచ్చాయి. ఈ సదస్సులలో జిల్లాలోని ఈ సదస్సుల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, రాజమండ్రి ఆర్డీవో కృష్ణనాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుష్మిత తదితరులు హాజరయ్యారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం పరిధిలోని కాతేరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



దోసకాయలపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

ప్రతి అర్జీకి 33 రోజుల్లోగా పరిష్కారం

దోసకాయలపల్లి రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

కోరుకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులు, ప్రజల భూసమస్యలు నిర్ణీతకాలంలో పరిష్కారం అయ్యేవిధంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు తెలిపారు. గురువారం కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఉద్దేశించి జిల్లావ్యాప్తంగా 272 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధిలో గురువారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలిరోజు జిల్లాలో 23 గ్రామ సదస్సులు నిర్వహించి ప్రజలు, రైతుల నుంచి 386 అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. రాజమండ్రి డివిజన్‌లో 149, కొవ్వూరు డివిజన్‌లో 237 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. ప్రతి అర్జీకి 33 రోజుల్లోగా పరిష్కారం లభిస్తుందని జేసీ తెలిపారు. సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ సదస్సులో సమస్య పరిష్కారంకోసం ఇచ్చే అర్జీదారులు అధికారులకు తగిన పత్రాలు అందజేయాలని కోరారు. భూ సంబంధ సమస్యల పరిష్కార విధానంలో రెవెన్యూ సదస్సులు చక్కటి వేదిక అని పేర్కొన్నారు. కోరుకొండ మండల పరిధిలో ఒక రెవెన్యూ సదస్సు నిర్వహించగా, అందులో 21 మంది అర్జీలు అందజేశారన్నారు. జిల్లా, డివిజన్, పరిధిలో సమస్య పరిష్కారంకోసం చాలామంది తమను కలిసి అర్జీ ఇవ్వడం జరుగుతోందన్నారు. మండల కేంద్రంలో అర్జీలు ఇవ్వడం వల్ల వాటి పరిష్కారంకోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ ధారా యశోదమ్మ, ధారా రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా హోంగార్డుతో అసభ్య ప్రవర్తన -7లో

బొమ్మూరు హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

15 నుంచి కోట సత్తెమ్మ తల్లి తిరునాళ్లు

- 19 వరకు మహోత్సవాలు : సహాయ కమిషనర్
- 18న రాజమండ్రి నుంచి మహిళలతో సారె -7లో



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న కాకినాడ జగన్నాథపురంలోని సెయింట్ థామస్ చర్చి

వందేళ్ల నాటి.. పురాతన చర్చిలు

క్రిస్మస్ సీజన్ మొదలైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చిలు విద్యుదీకరణతో ధగధగలాడుతున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు ఇతర ప్రాంతాల్లోను క్రైస్తవ దేవాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకుంటున్నాయి. డిసెంబరు నెల క్రైస్తవులకు ఎంతో ప్రత్యేకమైనది. అన్ని చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలు ప్రారంభం కావడంతో చర్చిల వద్ద సందడి కనిపిస్తోంది. ఈ నెలంతా క్రైస్తవులు క్రిస్మస్ సంబరాల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనల్లో గడుపుతారు. ఈ నేపథ్యంలో కాకినాడలోని వందల ఏళ్లనాటి పురాతన చర్చిల విశేషాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- క్రైస్తవులకు ఆధ్యాత్మికంగా ప్రాధాన్యమైన డిసెంబరు నెల
- చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు ప్రారంభం
- విద్యుదీకరణతో ఆకట్టుకుంటున్న చర్చిలు
- చారిత్రక నేపథ్యం కలిగిన ప్రార్థనా మందిరాలు

(ఆంధ్రజ్యోతి-కాకినాడ కార్పొరేషన్)

డచ్ దేశస్తుల సెయింట్ థామస్ చర్చి



ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న వందలాది చర్చిల్లో అతి పురాతన కాలం నాటివి కాకినాడలోనే ఉన్నాయి. 1780లో వ్యాపారం నిమిత్తం భారతదేశం వచ్చిన డచ్ దేశస్తులు కాకినాడ జగన్నాథపురంలో సెయింట్ థామస్ చర్చిని నిర్మించినట్లు చెప్తారు. పదెకరాల స్థలంలో చుట్టూ ప్రహరీ, ఒక ఎకరం స్థలంలో మందిరాన్ని నిర్మించారు. డచ్ వారి అనంతరం పోర్చుగీస్ వారు ఈ చర్చి బాధ్యతలను చూశారు. తర్వాత కాలంలో బ్రిటీష్ యాజమాన్యం మందిర నిర్వహణ చేపట్టింది. 1947, సెప్టెంబరు 17 నాటికి భారతీయ క్రైస్తవుల చేతుల్లోకి వచ్చింది. అప్పటినుంచి ఈ మందిరానికి సెయింట్ థామస్ పేరుకు అదనంగా చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) అనే పేరు వచ్చి చేరింది. దీని పరిధిలో కేరళ, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తోపాటు శ్రీలంక కూడా ఉంది. 1974 వరకు ఈ ఆలయంలో ఆంగ్లంలోనే ఆరాధన జరిగేది. 1975 నుంచి తెలుగులో కూడా ఆరాధన ప్రారంభించారు.

ఆర్‌సీఎం చర్చి: 1886

కాకినాడ జగన్నాథపురంలో మరో ప్రాచీన చర్చి ఉంది. దీన్ని కూడా ఆంగ్లేయుల కాలంలోనే 1886లో నిర్మించారు. సెయింట్ ఆర్న్ రోమన్ కేథలిక్ మిషన్(ఆర్సీఎం) చర్చిగా పిలుస్తారు. దీంట్లో ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన మేరీమాత విగ్రహం ప్రాచుర్యాన్ని పొందింది. కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉన్న మేరీమాతను దర్శించుకుని కొవ్వొత్తులు వెలిగించి తమ బాధలను ప్రార్థనల రూపంలో చెప్పుకుంటే మనశ్శాంతి కలుగుతుందని క్రైస్తవుల నమ్మకం.



కాకినాడ జగన్నాథపురంలోని ఆర్‌ఎంసీ చర్చి

118ఏళ్ల నాటి బాప్టిస్ట్ చర్చి

కాకినాడ జగన్నాథపురంలోనే 1906లో నిర్మించిన బాప్టిస్టు చర్చి ఉంది. 118ఏళ్ల క్రితం అప్పటి ఆంగ్లేయులు నిర్మించారు. దీన్ని కాకుండా నగరంలోని రాజారామ్మోహనరావు రోడ్డులోని గ్రేట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, ఎల్విన్‌పేటలోని బాప్టిస్ట్ చర్చి, రామారావుపేటలోని లూథరన్ చర్చిలను పురాతన కాలంలో నిర్మించారు. క్రిస్మస్ నెల ప్రారంభం కావడంతో అన్ని చర్చిలు లైటింగ్‌తో కళకళలాడుతున్నాయి.



విద్యుత్ వెలుగులతో కళకళలాడుతున్న కాకినాడ జగన్నాథపురంలోని బాప్టిస్ట్ చర్చి

'పిఠాపురంలో అలా మొదలైంది' చిత్రీకరణకు శ్రీకారం

- నటకిరీటి రాజేంద్రప్రసాద్‌పై సినిమా ముహూర్తపు సన్నివేశం షూటింగ్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం సినిమా షూటింగ్‌లకు వేదికగా మారుతోంది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానం(రామాలయం)లో 'పిఠాపురంలో అలా మొదలైంది' సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ప్రముఖ దర్శకుడు మహేష్‌చంద్ర దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ముహూర్తపు సన్నివేశాలను నటకిరీటి రాజేంద్రప్రసాద్‌పై జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన తాను ఎన్నో విజయవంతమైన సినిమాలకు దర్శకత్వం వహించానన్నారు. సరికొత్త ప్రేమకథా అంశంతో చిత్రాన్ని నిర్మించబోతున్నామని, ఇదే ప్రాంతంలో నెలరోజులపాటు చిత్ర నిర్మాణం జరుగుతుందని వివరించారు. జిల్లాలో ఉన్న నటీనటులకు, ఔత్సాహికులకు ఈ సినిమాలో నటించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తోపాటు థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్, సీనియర్ నటి జె.వాహిని, నటుడు కేదార్‌శంకర్, జబర్దస్త్ ఆర్టిస్ట్ కేవీ పాల్, బీఎస్ రాజు తదితర నూతన నటీనటులతో ఈ చిత్రాన్ని చిత్రీకరిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ, తీన్‌మార్ మల్లన్న మాట్లాడుతూ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం రామాలయ ఆవరణలో పెళ్లి సన్నివేశాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, ఓదూరి నాగేశ్వరరావు, కిషోర్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొడుతున్న పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి



అన్నవరం నూతన ఈవోగా సుబ్బారావు

రేపు బాధ్యతల స్వీకారం

అన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా వీర్ల సుబ్బారావు బాధ్యతల స్వీకరణకు దేవదాయ శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి కమిషనర్ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న సుబ్బారావును అన్నవరం ఈవోగా నియమిస్తూ గత నెల 29న ఉత్తర్వులిచ్చినా రిలీవ్ కాకపోవడంతో కొంత సందిగ్ధత నెలకొంది. సుబ్బారావును ఈవోగా ఏడాది పాటు డిప్యూటేషన్‌పై నియమిస్తూ కమిషనరు కార్యాలయం నుంచి ఆదేశాలొచ్చాయి. కొత్త ఈవోగా సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరిస్తారని దేవస్థానం అధికారులు వెల్లడించారు.

15న సత్యదేవుని మెట్లోత్సవం

అన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ప్రారంభ సూచికగా ప్రతిఏటా సత్యదేవుని సన్నిధిలో నిర్వహించే మెట్లోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం స్వామి, అమ్మవార్ల గ్రామసేవ అనంతరం 9.30 గంటలకు తొలి మెట్టు వద్ద పండితులు ప్రత్యేక పూజలు జరుపుతారు. అనంతరం స్వామివారి ప్రధానాలయం వరకు ఉన్న ప్రతి మెట్టుకు మహిళలు పసుపు, కుంకుమ పూసి హారతులిచ్చి నైవేద్యాలు సమర్పిస్తారు. సుమారు 380 మెట్లకు ఈ పూజా కార్యక్రమాలు చేపడతారు. 15 నుంచి సంక్రాంతి వరకు స్వామి, అమ్మవార్లకు ప్రతినిత్యం వెండి పల్లకిలో గ్రామసేవ నిర్వహిస్తారు.





శ్రీరామ పాదుకల విశిష్టతను వివరిస్తున్న అహోబిల స్వామి. చిత్రంలో త్రిదండి చినజీయర్ స్వామి

వైభవంగా శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

- త్రిదండి చినజీయర్ స్వామి, అహోబిల స్వామి రాక
- వేలాది మంది భక్తులతో కరసేవ
- ఆంధ్ర భద్రాద్రి క్షేత్రం పేరు తులా గిరిగా మార్పు

ప్రత్తిపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామ పరిధిలోని నరేంద్రగిరి రామాలయ నిర్మాణ ప్రదేశం వద్ద శ్రీరామ పాదుకా పట్టాభిషేక మహోత్సవాన్ని త్రిదండి చినజీయర్ స్వామి గురువారం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తొలుత త్రిదండి చినజీయర్ స్వామితోపాటు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి వర్తక సంఘం అధ్యక్షుడు అనంతపల్లి శ్రీను నివాసానికి చేరుకుని అక్కడ తీర్థ గోష్ఠి నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, టీడీపీ నాయకుడు కొమ్ముల కన్నబాబు జీయర్ స్వామిని దర్శించుకున్నారు. ఎస్‌బీఐ వీధి నుంచి ఓపెన్ టాప్ జీపులో ఊరేగింపుగా బయల్దేరిన స్వామీజీలు వేలాది మంది భక్తులు, మంగళవాయిద్యాల మధ్య కర సేవ చేస్తుండగా నరేంద్రగిరికి చేరుకున్నారు. అక్కడ వారికి నిర్వాహకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం చినజీయర్ స్వామి మెట్ల మార్గాన్ని ప్రారంభించి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు.

సమస్త దోషాలను తొలగించి సర్వ మానవాళికి శాంతి, శ్రేయస్సు ప్రసాదించేదే శ్రీరామ పాదుకా పట్టాభిషేకం అని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. సమతామూర్తి శ్రీరాముడి పాదుకలను ఆశ్రయించి ఆరాధిస్తే సంపద, రాజ్యం పదింతలు అయ్యాయని ప్రవచించారు. అహల్యా పాపాలను తొలగించడం, భరతుడి తాపాన్ని పోగొట్టి ధర్మకర్తగా నిలపడం, సుగ్రీవుడి భయాన్ని తీర్చి సుఖ సంపదలు ఇవ్వడం, శరణుకోరిన విభీషణుడిని రారాజు చేయడం, రుషులకు శాంతిని పెంచి పక్షికి మోక్షం ఇవ్వడం వంటివి శ్రీరాముడి మహిమలన్నారు. పాదుకా పట్టాభిషేకం ఆవశ్యకతను, శ్రీరామ చరిత్రను అహోబిల రామానుజ జీయర్ స్వామి, భరతుడు శ్రీరామ పాదకులతో రాజ్యం పాలించిన విధానాన్ని నేపాల్ కృష్ణమాచార్యులు వివరించారు.

ఆంధ్ర భద్రాద్రి రామ క్షేత్రంగా ఉన్న పేరును చిన జీయర్ స్వామి మార్పు చేశారు. ప్రత్తిపాడులోని ప్రత్తి అనగా తులమని అర్థం కలిగి ఉందని, భద్రాద్రిలో భద్రుడి ప్రార్థనకు కరిగివచ్చిన రాముడు ప్రత్తిపాడు ప్రజల ప్రార్థనకు ఇక్కడ కొలువుదీరనున్నారు. అందుకే ఈ ప్రాంతానికి తులాగిరి శ్రీరామ క్షేత్రంగా నామకరణం చేస్తున్నట్టు భక్తుల కరతాళ ధ్వనుల మధ్య జీయర్ స్వామి ప్రకటించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీరామ సేవక్ కమిటీ సభ్యులు అనంతపల్లి శ్రీను, గోగుల బుజ్జి, రెడ్నం రాజా, స్థానిక ప్రముఖుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, డీపీఎస్ రాజురమేష్, స్థల దాతలు చలంకూరి భాను కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.





ప్రత్తిపాడులో కర సేవకుల ప్రదర్శన, పాదుకా పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకిస్తున్న మహిళలు



మధురపూడి విమానాశ్రయం వద్ద ఢిల్లీకి నూతన సర్వీసు ప్రారంభించి కేక్ కట్ చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో ఎంపీలు పురందేశ్వరి, ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం నుంచి నేరుగా ఢిల్లీకి విమానం

- ప్రారంభమైన ఇండిగో సర్వీసులు.. ఇన్నాళ్లకు చిరకాల వాంఛ నెరవేరింది..
- విమాన సర్వీసును ప్రారంభించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

కోరుకొండ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి నూతనంగా విమాన సర్వీసు ప్రారంభించడం ద్వారా ఇన్నాళ్లకు ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. న్యూఢిల్లీ రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి నేరుగా గురువారం ఉదయం 9 గంటలకు 6ఈ364 ఇండిగో విమాన సర్వీసు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంది. నియమాలను అనుసరించి నీటిని వెదజల్లి నూతన విమాన సర్వీసుకు స్వాగతం పలికారు. ఈ తొలి విమాన సర్వీసులోనే ప్రయాణికులతో కలిసి న్యూఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఢిల్లీ నుంచి బయల్దేరి వచ్చిన ఈ తొలి విమాన సర్వీసుకు మధురపూడి విమానాశ్రయం వద్ద రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయశ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాజమండ్రి విమానాశ్రయం వద్ద కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి రాజమండ్రి నుంచి న్యూఢిల్లీకి వెళ్లే నూతన విమాన సర్వీసును ఉదయం 9.45 గంటలకు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం విమానాశ్రయం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ మొట్టమొదటి అడుగుగా రాజమండ్రి నుంచి దేశ రాజధాని ఢిల్లీకి నూతన ఎయిర్‌బస్ కల్పించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీదేనన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో రాజమహేంద్రవరానికి యావత్తు భారతదేశానికి విమాన సర్వీసులు అవసరమయ్యే ఆవశ్యకత ఉందన్నారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి తిరుపతి, వారాణసి, షిరిడి వంటి నగరాలకు విమాన సర్వీసులు నడిపేలా కేంద్రమంత్రి కృషిచేయాలని కోరారు. అనంతరం ప్రయాణికులతో మధురపూడి విమానాశ్రయం నుంచి బయల్దేరిన ఇండిగో నూతన విమాన సర్వీసు మధ్యాహ్నం 12 గంటలకు న్యూఢిల్లీకి వెళ్లింది. కాగా ఈనెల 1న వాణిజ్య రాజధాని ముంబైకి విమాన సర్వీసు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ముంబై, ఢిల్లీ విమాన సర్వీసుల కోసం ఎంతోకాలంగా ఎదురుచూసిన ఉభయగోదావరి జిల్లావాసుల కల ఇన్నాళ్లకు నెరవేరింది.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.38 కోట్లు

బంగారం 31 గ్రాములు, వెండి 990 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభ్యం

ఆత్రేయపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, టి.ప్రసాద్ సమక్షంలో గురువారం తెరిచి వసంత మండపంలో లెక్కించారు. 37 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.92,16,755, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.42,47,958... మొత్తం రూ.1,38,49,477 ఆదాయం లభించింది. బంగారం 31 గ్రాములు, వెండి 990 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చాయని ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.3,84,744 లభించింది. లెక్కింపులో గ్రామస్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



వ్యానులో తరలిస్తుండగా పట్టుకున్న ఫర్నిచర్

అంతా టేకుమయం

అటవీ శాఖ అధికారిణి తరలించిన ఫర్నిచర్ వివరాలు వెల్లడించిన కూనవరం రేంజర్

ఎటపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం అటవీ శాఖలో రేంజర్‌గా పనిచేసి ఇటీవల బదిలీ వెళ్లిన అధికారిణి తాలూకా టేకు ఫర్నిచర్‌ను బుధవారం రాత్రి ఐషర్ వ్యాన్‌లో తరలిస్తుండగా నందిగామ వద్ద గ్రామస్తులు అడ్డగించి పట్టుకున్న సంగతి తెలిసిందే. వెంటనే ఆ ఫర్నిచర్‌ను, వ్యాన్‌ను అటవీ శాఖ సిబ్బంది పురుషోత్తపట్నంలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. గురువారం ఉదయం కూనవరం రేంజర్ కరుణాకర్ సమక్షంలో లారీలోని టేకు ఫర్నిచర్‌ను బయటకు తీసి విచారించారు. అందులో పాత (పాలిష్ వేసిన) టేకు టేబుల్, డైనింగ్ టేబుల్, డ్రెస్సింగ్ టేబుల్, దివాన్‌కాట్, టేకు కుర్చీలు, టేకు మంచాలు, నాన్ టేకు దిమ్మ లభ్యమైనట్టు రేంజర్ కరుణాకర్ తెలిపారు. ఎటువంటి పత్రాలు లేకుండానే వాటిని రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. వ్యాన్‌ని స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించిన పత్రాలు చూపించాలని బదిలీ అయిన అటవీ శాఖ అధికారిణి విజయలక్ష్మిని అడగ్గా పత్రాలు తీసుకొస్తానని చెప్పిందని కరుణాకర్ చెప్పారు. విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

డివైడర్‌ని ఢీకొని వ్యక్తి మృతి

శంఖవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద 16వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... జెడ్.రాగంపేట గ్రామానికి చెందిన శ్రీమంతుల వీర వెంకటరమణ (37) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం స్నేహితుడు పల్సర్ బైక్ తీసుకుని సొంత పనిమీద తుని బయల్దేరాడు. కత్తిపూడి శివారు సీతంపేట బంకు సమీపంలో డివైడర్‌ని బలంగా ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.13,35,485



బాలబాలాజీ హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.33,35,485 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 42 రోజులకుగాను హుండీల లెక్కింపును గురువారం నిర్వహించారు. లెక్కింపు కార్యక్రమానికి అమలాపురం తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారు. ఈ ఆదాయంతోపాటు 0.2 గ్రాముల బంగారం, 0.120 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, అర్చకులు, స్వామివారి సేవకులు, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి కోట సత్తెమ్మ తల్లి తిరునాళ్లు



నిడదవోలు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మతల్లి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 19 వరకు తిరునాళ్ల మహోత్సవాలు నిర్వహించనున్నామని సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. 15న ఫౌండర్ ఫ్యామిలీమెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతులు కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించి అమ్మవారికి లక్ష కుంకుమార్చన విశేష పూజలు నిర్వహించనున్నారు. 16న గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, నిడదవోలు నాంగల్యదేవి దేస్థానం వారితో సారె సమర్పణ, 17న నిడదవోలు ఆర్యవైశ్య సంఘం సారె సమర్పణ, 18న రాజమహేంద్రవరం నుంచి 101 మంది మహిళలతో సారె, పసుపు కుంకుమ సమర్పణ, 19న తిరునాళ్ల ముగింపోత్సవం జరుగుతాయని సహాయ కమిషనర్ తెలిపారు.

నాన్న గద్దర్ ఇచ్చిన స్ఫూర్తి..ప్రజలే నాకు ఆదర్శం

గద్దర్ జాతీయ సేవా అవార్డుల పంపిణీలో వెన్నెల గద్దర్



పి.గన్నవరంలో గద్దర్ జాతీయ సేవా పురస్కార అవార్డులను ప్రధానం చేస్తున్న వెన్నెల గద్దర్, ఎమ్మెల్యే సత్యనారాయణ

పి.గన్నవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నాన్న గద్దర్ లేకపోయినప్పటికీ ఆయన ఇచ్చిన స్ఫూర్తి, ప్రజలను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళుతున్నానని తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక సారధి ఛైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరం సాయితేజ జూనియర్ కళాశాలలో జరిగిన గద్దర్ జాతీయ సేవా పురస్కారాలు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. నాన్న ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి అవకాశం కల్పించిన జాతీయ కాంగ్రెస్ అధినాయకులకు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధినాయకులకు పేరుపేరున వందనాలు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యేగా ఓటమి పొందిన సమయంలో నారాజ్యం, నారాజు గెలిచాడని చాటిచెప్పినట్లు ఆమె వివరించారు. అనంతరం నాప్రభుత్వం రాష్ట్ర సంస్కృతిక సారధి ఛైర్మన్‌గా అవకాశం కల్పించి నాపాట, ఆటతో, మాటతో, నాటకాలతో పల్లె పల్లెకు తిరిగి ప్రజలను చైతన్యవంతం చేసే అవకాశం మా ప్రభుత్వం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. మనమందరం తెలుగు తల్లి పిల్లలు కావడంతో అదే గజ్జెల సవ్వడితో ఏపీలో కూడా ముందుకు వస్తున్నానని చెప్పారు. గద్దర్ ఆశయాలు ఏమిటంటే అందరూ బాగా చదువుకోవాలి-జ్ఞానం ఒక్కటే మిగులును, ఎక్కడైతే అణచివేత ఉంటుందో..అక్కడ తిరుగుబాటు ఉండాలన్నదే నాన్న ఆశయాలన్నారు.

అన్నలారా లెండిరా.....

నాకు జన్మనిచ్చిన తల్లివి, నాకుతోడబుట్టిన చెల్లివి, ఎన్నాళ్ల కన్నీళ్లు, నువ్వు బతుకులు మార్చే శక్తివి, హే హే అమ్మ నువ్వు మహాశక్తివి తల్లి అంటూ గద్దర్ వెన్నెల విప్లవ గీతాన్ని ఆలపించారు. అదేవిధంగా విద్యార్థులకు సామాజిక సందేశాన్నిచ్చే రెండు కథలను వివరించి వాటికి అర్థం చెప్పారు. రోజు ఒక కథ విని పడుకోండి అంటూ విద్యార్థులకు మదర్ థెరిస్సా జీవిత సేవలను వివరించారు. మదర్ థెరిస్సా తన 12వ ఏటలోనే జీవితలక్ష్యం ఎంచుకున్నారన్నారు. 69ఏళ్ల పాటు భారదేశంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవలందించారన్నారు. సమాజంలో సేవలందించే వారిని గుర్తించి పురస్కారాలు అందించాలనే ఆలోచన రావడం మంచి పరిణామమని చెబుతూ అవార్డుల నిర్వహణలో పాల్గొన్న మమత స్వచ్ఛంద సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్‌కు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాసమస్యలను పాటరూపంలో వివరిస్తూ సమాజంలో మార్పుకోసం పోరాడిన మహోన్నత వ్యక్తి, శక్తి గద్దరన్న అని కొనియాడారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఎన్నో విప్లవ గీతాలను రచించి, ఆలపించారన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలవారు 110మందికి అవార్డులు అందించి సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మాజీ జెడ్పీ ప్రతిపక్షనేత సాకా ప్రసన్నకుమార్, మనం ఫౌండేషన్ ఛైర్మన్ చక్రవర్తి, ముదునూరి లతేంద్రవర్మ, బల రామ్మూర్తి, దాసరి రత్నం, హనుమాన్,పెద్దకాపు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో లక్ష్యాలను చేధించాలి

- నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్
- అంతర్ కళాశాలల విలు విద్య పోటీలు



బాణం వేసి విలువిద్యపోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్

దివాన్‌చెరువు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఏకలవ్యుని మాదిరిగా ఏకాగ్రతతో లక్ష్యాలను చేధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, క్రీడాబోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆచార్య జి. సుధాకర్ అన్నారు. నన్నయ వర్సిటీ విద్య కళాశాల ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల విలువిద్య పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలను గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుధాకర్ గురివైపు బాణం సంధించి పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విలువిద్యను ప్రోత్సహించడంలో నన్నయ విశ్వవిద్యాలయం వ్యాయామవిద్య విభాగం చేస్తున్న కృషిని అభినందించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల నుంచి పురుష, మహిళ అభ్యర్థులు 40 మంది హాజరయ్యారు. ఇండియన్ రౌండ్ ఆర్చరీ విధానంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభావంతులైన నలుగురు పురుషులను, నలుగురు మహిళలను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారు. వీరిలో పురుషుల్లో టి.అజయ్(ఎస్‌కేవీటీ కళాశాల, రాజమహేంద్రవరం), పి.కృష్ణ(సీబీఆర్ కళాశాల, పిఠాపురం) యు.మహేష్‌బాబు, వి.వెంకటప్రసాద్(ప్రభుత్వడిగ్రీ కళాశాల, చింతలపూడి) ఎంపికయ్యారు. మహిళల్లో డి.మానస, జి.నవ్యమమత(ఏఎస్‌డీ కళాశాల, కాకినాడ), జి.సావిత్రి, సీహెచ్ అంజలి(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి)లు ఎంపికయ్యారు. వీరు ఈనెల 22నుంచి 26వరకూ భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో జరిగే అఖిల భారత విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఛైర్మన్ కె.సుబ్బారావు, కార్యదర్శి వి.సాల్మన్‌దేవానంద్, పరిశీలకుడు సీవీ సుబ్రహ్మణ్యం, ఎంపిక కమిటీ సభ్యులు ఆలీ, విజయ్‌కుమార్, వ్యాయామ విద్య అధ్యాపకులు ఆర్.సాంబశివరావు, బి.రామ్‌గోపాల్, బాలసత్యనారాయణ, విశ్రాంత ఎంఈవో గోపాలకృష్ణ, టి.లక్ష్మణ్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలకు పిఠాపురం విద్యార్థి ఎంపిక



పిఠాపురం విద్యార్థి కృష్ణతో కోచ్ లక్ష్మణరావు

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురం విద్యార్థి ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలోని నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ కాలేజీ ఆర్చరీ పోటీల్లో పిఠాపురం పట్టణంలోని సీబీఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ సెకండియర్ చదువుతున్న పి.కృష్ణ ఇండియన్ రౌండ్ వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్‌లో రజత పతకం సాధించాడు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా ఒడిసా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న ఆల్‌ఇండియా యూనివర్సిటీస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కృష్ణ ను, అతనికి శిక్షణ ఇచ్చిన కోచ్ లక్ష్మణరావులను పలువురు అభినందించారు.

పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్స్

- ట్రేడ్ డబ్బులు ఫోన్ పే చేయాలని దుకాణదారులకు ఫోన్
- పోలీసులకు ఫిర్యాదుచేసిన కమిషనర్

పెద్దాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ పేరుతో ఓగుర్తు తెలియని వ్యక్తి నుంచి పట్టణంలో పలువురు దుకాణదారులకు ఫోన్‌కాల్స్ వచ్చాయి. మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని లేకపోతే ఇబ్బందులు తప్పవని సదరు వ్యక్తి దుకాణదారులకు కాల్స్ చేసి నేనుచెప్పిన నంబర్‌కు నగదును ఫోన్ పే చేయాలని లేకపోతే షాప్ సీజ్ చేస్తామని చెప్పడంతో పలువురు కంగారుపడ్డారు. గతేడాది ట్రేడ్‌కు సంబంధించి ట్యాక్స్‌లు చెల్లించినా మళ్లీ ఎందుకు అడుగుతున్నారని అనుమానం వచ్చి పలువురు దుకాణదారులు ఆందోళనకు గురయ్యారు. ఫేక్ ఫోన్ కాల్ చేసిన వ్యక్తి నెం.7569778380 నుంచి కాల్స్‌చేసి డబ్బులు అడిగినట్లు తెలియడంతో పలువురు ఈవిషయాన్ని ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతిని ఆరా తీయడంతో ఈవిషయం తన దృష్టికి వచ్చిందని తాను ఎవరికీ ఫోన్ చేయలేదన్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈవిషయంపై ఎస్ఐ మౌనికను వివరణ కోరగా ఈవిషయం తమ దృష్టికి వచ్చిందని, వ్యాపారులను ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. డబ్బులు ఎవరూ చెల్లించి మోసపోవద్దని ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు.

జాతీయస్థాయి వర్క్‌షాపునకు మంగారాణి ఎంపిక



ఎంపిక పత్రాన్ని మంగారాణికి అందిస్తున్న డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిల్లీలో నిర్వహించే జాతీయ వర్క్‌షాపునకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన పత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు అందించారు. నేషనల్ సెంటర్‌ఫర్ స్కూల్ లీడర్‌షిప్(ఎన్‌సీఎస్ఎల్ న్యూపా)వారు డిల్లీలో నిర్వహించనున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేందుకు పెడగోగికల్ లీడర్‌షిప్ అనే అంశంపై నిర్వహించే కంటెంట్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో మంగారాణి పాల్గొంటారు. ఈ వర్క్‌షాపులో పాల్గొనే అవకాశం ఆంధ్రప్రదేశ్ నుంచి మంగారాణి ఒక్కరికే రావడంతో జిల్లా విద్యాశాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ వర్క్‌షాపు ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు డిల్లీలోని ఎన్ఎస్‌సీఎల్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంగారాణిని అర్బన్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈవో-2 రమారజనీ అభినందించారు.

జాడలేని పులి

ధారపల్లి జలపాతం మూసివేత
ప్రజలను అప్రమత్తంచేసిన ఫారెస్టు అధికారులు

ప్రత్తిపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో తిష్టవేసిన పెద్దపులి జాడ గురువారం అటవీ అధికారులకు చిక్కలేదు. ఐదురోజుల క్రితమే బురదకోట అటవీ ప్రాంతానికి వచ్చిన పెద్ద పులి చంపిన లేగదూడ ప్రదేశానికి కూడా రాలేదు. దీంతో పులి జాడ తెలియక అటవీశాఖ అధికారులు, సిబ్బంది గాలింపు ముమ్మరం చేశారు. బురదకోట కేంద్రంగా 3కిలో మీటర్ల పరిసరాల్లో ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాలను గురువారం పరిశీలించిన పులి ఆచూకీ లభించలేదు. దీంతో అటవీప్రాంతాలను ఆనుకుని ఉన్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఏ సమయంలోనైనా పులి సంచరించవచ్చని ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇదిలావుంటే పులి సంచరించే బురదకోట సమీపాన ఉన్న ధారపల్లి జలపాతం వద్దకు పులి రావచ్చనే ముందుజాగ్రత్త చర్యగా ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గారాంప్రసాద్ ధారపల్లి జలపాతం మార్గాన్ని మూసివేశారు. ఈ జలపాతం వద్దకు సందర్శకులు రాకుండా మార్గం మూసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ధారపల్లి వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గిపోయింది. పులి హెచ్చరికలకు జలపాతం వద్దకు ఎవరినీ అనుమతించడంలేదు. బాపన్నదొర రైతుకు చెందిన లేగదూడను పెద్దపులి చంపిన ఘటన తరువాత పశువులపై ఎటువంటిదాడి జరిగిన సమాచారం లేదు. చంపిన లేగదూడ కళేబరం వద్దకు పులి రాకపోవడం అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలువల్ల విశ్రాంతి దశలో పులి ఉండవచ్చని గిరిజనులు అభిప్రాయపడుతున్నారు.



ధారపల్లి జలపాతం మార్గాన్ని బంద్ చేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

బండిరేవులో దారి దోపిడీ

- స్టేషన్‌కు రమ్మంటూ ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



దారిదోపిడీకి గురైన ఆదివాసీ యువకులు వీరే

ఎటపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ జరగనిరీతిలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని బండిరేవు గ్రామంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి సరికొత్త దొంగతనం జరిగింది. కారులో వచ్చి రహదారి పక్కన నిల్చున్న ఇద్దరు ఆదివాసీ యువకుల చేతులు పట్టుకుని, కొంత నగదును, దిచక్ర వాహనం ఎత్తుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సాలెబుడపు ఆదివాసీ గ్రామానికి చెందిన మడకం దేవయ్య, మడివి ఇర్మా ఇద్దరూ ద్విచక్రవాహనంపై బుధవారంరాత్రి నెల్లిపాక వెళ్తున్నారు. బండిరేవు శివారులో వీరు ద్విచక్ర వాహనం ఆపి ఉండగా, భద్రాచలం వైపు నుంచి చింతూరు వైపు వస్తున్న కారులో నలుగురు వ్యక్తులు వారివద్ద ఆపి, ఇద్దరి యువకులను చేతులమడిసి సెల్‌ఫోన్, కొంత సొమ్ములు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారి ద్విచక్ర వాహనం తీసుకుని చింతూరు వైపు వెళ్లిపోయారు. ఆ గుర్తు తెలియని వ్యక్తులు వెళుతూ రేపు స్టేషన్‌కు వచ్చి, ద్విచక్ర వాహనం తీసుకెళ్లాలని వారికి సూచించారు. కంగుతిన్న యువకులు ఇంతకీ మీరెవరు.. తమ ద్విచక్ర వాహనంను ఎందుకు తీసుకెళ్తున్నారని అడిగితే దౌర్జన్యంగా పక్కకు నెడుతూ, పోలీస్ డిపార్టుమెంట్ అని బెదిరించారని యువకులు చెప్పారు. కాగా ఉదయం ఇద్దరు యువకులు గ్రామ పెద్దల సహకారంతో ఎటపాక, చింతూరు పోలీస్‌స్టేషన్‌లో ఆరా తీయగా, ద్విచక్ర వాహనంను ఎత్తుకెళ్లిన వారు పోలీసులు కాదని నిర్ధారణకు వచ్చారు. దాంతో ఎటపాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల బండిరేవు జాతీయ రహదారిపై ఈ తరహా దారిదోపిడీ ఘటనలు పెరిగాయని, వాహనదారులు, స్థానిక ఆదివాసీలు భయందోళన చెందు తున్నారు. ఇకనైనా పోలీసులు దారిదోపిడీ దొంగలపై నిఘాపెట్టి, చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దివ్యాంగురాలిపై ఫీల్డ్‌అసిస్టెంట్ అత్యాచారయత్నం

కరప, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తన కుమార్తెపై ఒక వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడినట్టుగా ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదుచేసినట్టుగా కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. వివరాల్లోకి వెళితే..కరపమండలం వేములవాడ గ్రామానికి చెందిన ఒక మహిళ కేటరింగ్ పనిచేసుకుంటుండగా, ఆమె భర్త హైదరాబాద్‌లో పనిచేసుకుంటున్నాడు. వారికి ఒక కుమారుడు, మానసిక స్థితి సరిగా లేని దివ్యాంగురాలైన ఒక కుమార్తె ఉంది. కాగా గత బుధవారం సాయంత్రం సదరు మహిళ కేటరింగ్ పనికి వెళ్తూ కుమార్తెను చూసుకోమని కుమారుడికి చెప్పింది. రాత్రి 9 గంటల సమయంలో సదరు కుమారుడు ఇంటి నుంచి తన పిన్ని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మట్టపర్తి వీరబాబు ఆపి సినిమాకు వెళదామా అని అడిగాడు. దీనికి మాఅక్క ఒక్కరే ఇంట్లో ఉందని, రావడానికి కుదరదని పిన్ని ఇంటికి వెళ్లిపోయాడు. పిన్నిని తీసుకుని తిరిగి తన ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి దివ్యాంగురాలిపై వీరబాబు అత్యాచారయత్నం చేస్తున్నాడు. దీంతో వారు కంగారుపడి కేకలు వేస్తూ తలుపులు గట్టిగా కొట్టడంతో భయపడిన వీరబాబు అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

ఎస్.యానాంలో ఈనెల 27 నుంచి..
సీనియర్ నేషనల్ ఉమెన్స్ బీచ్ వాలీబాల్ పోటీలు



అమలాపురం పీఆర్ అతిథిగృహంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం బీచ్‌ను భవిష్యత్‌లో ఎంతగానో అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు సీనియర్ నేషనల్ లెవెల్ ఉమెన్స్ బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రకటించారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో డే అండ్ నైట్ మ్యాచ్‌లను నిర్వహించే విధంగా చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా విద్యాశాఖాధికారి, వ్యాయామ ఉపాధ్యాయులు, వాలీబాల్ పోటీల నిర్వహణ కమిటీ సభ్యులతో గురువారం అమలాపురం పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఆనందరావు సమావేశం నిర్వహించారు. బీచ్ వాలీబాల్ పోటీల్లో భాగంగా శుక్రవారం ఉదయం భూమిపూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రధానంగా ఎనిమిది జట్లు పాల్గొంటాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి గొలకోటి ఫణీంద్రుమార్ తెలిపారు. టోర్నమెంట్‌ను విజయవంతం చేసేవిధంగా వ్యాయామ ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఉండ్రు ముసలయ్య, కామన గణేష్, కె.ఈశ్వరరావు, ఎం.రామారావు, మూర్తి పాల్గొన్నారు.

వసతిగృహంలో మద్యం బాటిళ్లతో బీభత్సం

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వసతిగృహంలోకి మద్యంమత్తులో బీరుబాటిల్స్ పగులగొట్టి బీభత్సం సృష్టించి విద్యార్థులను బెదిరించి డబ్బులు లాక్కొని పరారైన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్‌లు గురువారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పిఠాపురం పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతిగృహంలోకి ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు మద్యంమత్తులో ఉండి వెనుకవైపు నుంచి లోపలకు ప్రవేశించారు. 8,9,10 తరగతుల విద్యార్థులను బెదిరించి అక్కడే బీరు బాటిల్స్ పగులగొట్టి పొడిచి చంపుతామంటూ భయభ్రాంతులకు గురిచేశారు. వారి వద్దన ఉన్న రూ.540ను లాక్కొని పరారయ్యారు. దీనిపై వసతిగృహ సంక్షేమాధికారి చేసిన ఫిర్యాదు మేరకు పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు పాల్పడిన రథాలపేటకు చెందిన పూడి గంగాధర్ అలియాస్ బాలు, కుమారపురం గ్రామానికి చెందిన గుబ్బల దయానందపాల్‌లను గురువారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. వీరిపై రౌడీషీట్లు తెరుస్తున్నట్లు సీఐ తెలిపారు. వసతిగృహాలు, పాఠశాలలు, కళాశాలలు వద్ద అలజడులు సృష్టించే వారు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బాలుర వసతి గృహంలో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసిన వారిని అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్ఐలు

మత్స్యకార వర్గాల్లో
రసాయన పరిశ్రమల మామూళ్ల చిచ్చు

- రెండు వర్గాల మధ్య కొట్లాట



కోనపాపపేట రామాలయం ఆవరణలో సమావేశంలో ఘర్షణపడుతున్న మత్స్యకారులు

కొత్తపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రసాయనాల పరిశ్రమల యాజమాన్యం నుంచి ఒక వర్గానికి చెందిన మత్స్యకారులు రూ.6కోట్లు మామూళ్లు తీసుకున్నారనే విషయంపై గురువారం కోనపాపపేటలో జరిగిన సమావేశం వివాదానికి దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కేఎస్ ఈజెడ్‌లో ఏర్పాటుచేసిన లైఫిజ్ ఫార్మా కంపెనీ నుంచి కోనపాపపేటకు చెందిన బాపన్నదొర, దేముడు అనే వ్యక్తులు రూ.6కోట్లు మామూళ్లు తీసుకున్నారనే అనుమానంపై గురువారం స్థానిక రామాలయంవద్ద మత్స్యకారులు సమావేశమయ్యారు. ఈవిషయం తెలుసుకున్న బాపన్నదొర, అతని సోదరులతోపాటు మరికొంత మంది రామాలయంవద్ద నిర్వహిస్తున్న సమావేశంలోకి వెళ్లి మత్స్యకారు ల్లో వేరే వర్గానికి చెందిన చొక్కాప్రసాద్, పేతురులపై దాడి చేయడం, మత్సకారులందరూ మూకుమ్మడిగా ప్రతిఘటించడంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. బాపన్నదొర, అతని సోదరులతోపాటు మరికొంత మంది తమపై దాడి చేశారని ప్రకాష్, పేతురు కొత్తపల్లి పోలీసుస్టేషన్‌కు ర్యాలీగా వచ్చి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.వెంకటేష్ చెప్పారు.

మహిళా హోంగార్డుతో అసభ్య ప్రవర్తన

- బొమ్మూరు హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంరూరల్ మండలం బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పోలీస్ స్టేషన్‌లో నాలుగున్నరేళ్లుగా హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తు న్న ప్రసాద్ ఈనెల 8న రాత్రి విధులు నిర్వర్తిస్తుండగా బయట రౌండ్స్‌కు వెళ్లి తిరిగి అతను తెల్లవారుజామున 2:30కు మద్యంమత్తులో పోలీ స్‌స్టేషన్‌కు వచ్చి అక్కడ విధుల్లో ఉన్న మహిళా హోంగార్డుపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో భయపడి ఇంటికి వెళ్లిపోయిన ఆమె తన భర్తకు విషయంచెప్పి అతన్ని తీసుకుని వచ్చి బొమ్మూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ దృష్టికి సమస్యను వివరించడంతో ఆయన ఆదేశాల మేరకు గురువారం ప్రసాద్‌పై కేసు నమోదుచేసి అతన్ని సస్పెండ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌పీఎఫ్ అదుపులో 8మంది బాలలు



బాలలను అదుపులోకి తీసుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వివిధ పనుల నిమిత్తం బీహార్, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న 8మంది బాలలను రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఐపీఎఫ్ బి.సైదయ్య, ఏఎస్ఐపీఎఫ్ పి.సత్యనారాయణ, హెచ్‌సీ ఆర్. బాపూజీ, జి.అప్పారావు, కానిస్టేబుల్స్ జె.నారాయణ, కె.మురళీ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ డీసీపీయూ జి.తిరుపతిరావు, స్టేట్ కోఆర్డినేటర్ బి.చంద్రశేఖర్, ఏపీవో కె.శ్రీకాంత్ రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో శాలీమార్ టూ హైదరాబాద్ వెళ్లే ఈస్ట్‌కోస్టు ఎక్స్‌ప్రెస్‌లో ఈ బాలలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, సికింద్రాబాద్‌లలో పనుల నిమిత్తం బీహార్‌కు చెందిన ఏజెంట్లు దిన సహని, దీపక్‌కుమార్, హీరా షైక్, లాలాన్‌కుమార్ తరలిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఏజెంట్లను అదుపులోకి తీసుకుని బాలల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు చెప్పారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రాజానగరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన కొంతమూరుకు చెందిన తోట కనకదుర్గ హత్యకేసులో నిందితుడు నరసింహరాజుకు కోర్టు జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరంలోని 5వ సెషన్స్‌జడ్జి కోర్టులో జడ్జి డబ్బిరి విజయ్‌గౌతం తీర్పు ఇచ్చారని రాజానగరం పోలీస్‌లు గురువారం తెలిపారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శంభుప్రసాద్, పీపీ లక్ష్మణ్‌నాయక్ వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ సహకరించారన్నారు.

క్రమ శిక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలి

డీఈవో వాసుదేవరావు



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

రాజానగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో క్రమ శిక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు పిలుపునిచ్చారు. రాజానగరం మండలం మల్లంపూడిలోని శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న పాఠశాల నాయకత్వ అభివృద్ధి శిక్షణా కార్యక్రమం రెండో సైకిల్ నాలుగో బ్యాచ్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులకు పలు సూచనలు అందించారు. తొలుత జిల్లాలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను ఘన విజయం చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. పాఠశాల విద్యలో విద్యా ర్థుల క్రమ శిక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. అలాగే పాఠశాల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులతో కలిసి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసిన 10వ తరగతి యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తూ పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రస్తుత పాఠశాలల్లో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేలా ప్రతి టీచరు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ప్రతి విద్యార్థి ఆశించిన అభ్యసన ఫలితాలు సాధించే విధంగా, ప్రతి రోజు పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ మోనిటరింగ్ అధికారి గౌరీశంకరరావు, ఎంఈవోలు పాల్గొన్నారు.

తొకాడ హైస్కూల్ సందర్శన

మండలంలోని తొకాడ హైస్కూల్‌ను డీఈవో వాసుదేవరావు ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న హిందీ పరీక్షల నిర్వహణ తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలను శ్రద్ధగా రాస్తే వార్షిక పరీక్షలు రాయడం సులువవుతుందన్నారు. తొలుత ప్రశ్నలు జాగ్రత్తగా చదివి సమాధానం రాయడానికి ప్రయత్నించాలన్నారు. నూరుశాతం పరీక్షలకు హాజయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.అబ్బులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సిబ్బందికి పూర్తి జీతాలు చెల్లించాలి

• దళారీలను అరికట్టాలి • జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేత



సూపరింటెండెంట్ సూర్యప్రభకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీజీహెచ్ (బోధనాసుపత్రి)లో శానిటేషన్, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి నిబంధనల మేరకు పూర్తి జీతాలు చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే మధ్య దళారీ వ్యవస్థ బెదిరింపులకు పాల్పడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభకు పలువురు శానిటేషన్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శానిటేషన్ సూపర్‌వైజర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేముల మహేష్‌బాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో కిందిస్థాయి ఉద్యోగుల శ్రమ దోపిడీ జరుగుతోందని, టీవీటీ కాంట్రాక్టర్, అతని అనుచరులు కార్మికులకు తక్కువ జీతాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వంతో కాంట్రాక్టు సంస్థ చేసుకున్న ఒప్పందానికి విరుద్ధంగా కార్మికులకు జీతాలు ఇసున్నారన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం జరగకపోతే రాష్ట్ర గవర్నర్‌ను కలుస్తామని, తక్షణమే ఈ అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సెల్‌ఫోన్, నగదు చోరీ

కొవ్వూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్, నగదు దొంతనంపై కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం దేవలభద్ర గ్రామానికి చెందిన సరళన చిరంజీవులు ఈ నెల 12న కొవ్వూరు శివానంద పార్కు వద్ద ఉన్న సోదరుడి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ప్రవేశించి రెడ్‌మీ సెల్‌ఫోను, రూ.5వేల నగదు దొంగిలించుకుపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

» గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

» సమస్యలపై రైతులు, గ్రామస్థుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ



కాతేరు సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి లిపారు. కాతేరులో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన విచ్చేసి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనేక ప్రభుత్వ ప్రైవేటు స్థలాలను కబ్జా చేశారని, వాటిని రెవెన్యూ సదస్సుల ద్వారా గుర్తించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి, తహశీల్దారు కుమార్ బాబు, టీడీపీ నాయకులు మత్యేటి ప్రసాద్, గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, బిక్కిన సాంబశివరావు, గంగిన తిరుమలరావు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలో ముక్కినాడ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఎస్.లక్ష్మీలావణ్య మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించి గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కారణంగా అనేక లోపాలు ఉత్పన్నమయ్యాయని, వీటన్నింటిని సరిచేసే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ముక్కినాడ పరిధిలో భూముల సర్వేకు సంబంధించి సుమారు 10 మంది రైతులు అర్జీలు సమర్పించినట్టు చెప్పారు. సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ కుమారి, ఆర్ఐ రంభ, మండల సర్వేయర్ అనిత, వీఆర్వో సాయిప్రసాద్, అటవీ, దేవాదాయ, రిజిస్ట్రేషన్, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలో ఇళ్లపల్లి, రాళ్లఖండ్రిక, తుమ్మలపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇళ్లపల్లి సదస్సులో మ్యూటేషన్‌ల నిమిత్తం రెండు దరఖాస్తులు అందాయని తహశీల్దార్ సత్యకృష్ణ తెలిపారు. ఆర్ఐ రవి, సర్వేయర్ కుమారి, వీఆర్వో సుబ్బారావు, బిక్కవోలు ప్రాచీన ఆలయాల ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేటలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 10 ఫిర్యాదులు అందాయని తహశీల్దార్ కోను అనసూయ తెలిపారు. గ్రామంలో తమ భూముల రికార్డులో ఉన్న దానికి భూమికి తేడాలు ఉన్నాయని వాటిని సర్వే చేయాలని ఎనిమిది ఫిర్యాదులు, మ్యుటేషన్ కోసం ఒక ఫిర్యాదు, అలాగే 22ఎ జిల్లా తాలూకా బోర్డులో ఉండి 515, 516 సర్వే నెంబరులో ఉన్న తమ ఇల్లు రిజిస్ట్రేషన్ అవ్వడం లేదని వాటిని మార్చాలని కోరుతూ కొంతమంది కలిసి ఒక ఫిర్యాదు ఇచ్చారు. ఫిర్యాదు దారులందరికీ రశీదులు ఇచ్చామని ఫిర్యాదులన్నీ ఆన్‌లైన్ చేశామని గ్రామ వీఆర్వో సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉండవిల్లి గిరిబాబు, బలిరెడ్డి దుర్గారావు, గారపాటి రాంబాబు, పోతుల చిన్నికాపు, మండవిల్లి గుప్త, గ్రామ కార్యదర్శి వి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాల్లో 2025 జనవరి 6వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు నిర్వహిస్తామని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గోకవరం: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అవకతవకలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెంలో జరిగిన సదస్సుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా సర్వే నెంబరు 183/3 ఏ3సీలో 1.94 ఎకరాల శ్రీరామ ధర్మసత్రానికి చెందిన భూమి అన్యాక్రాంతమైనదని తహశీల్దారు సాయిప్రసాద్‌కు ఫిర్యాదు అందింది. దీంతోపాటు పలు భూసమస్యలు పరిష్కరించాలంటూ రైతుల నుంచి అర్జీలు అందాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్నబాబు, దాసరి తమ్మన్నదొర, అడపా భరత్, పాలూరి బోస్, ఉంగరాల రాము, మండిగ బాలాజీ, ఎంపీడీవో గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలో ములకల్లంక గ్రామానికి సంబంధించి బొబ్బిల్లంక సచివాలయం 2లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 6 అర్జీలు వచ్చాయి. అండంగల్‌లో పేర్లు తప్పుగా నమోదు అయ్యాయని వాటిని సవరించాలని కోరుతూ 3, సర్వే నెంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు అయినా పట్టాదారు పాస్‌బుక్స్ రాలేదని 3 అర్జీలు వచ్చినట్టు డిప్యూటీ తహశీల్దార్ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, వీఆర్వో లీల ప్రభాకర్, అటవీ, దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు, సబ్ రిజిస్ట్రారు, మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణునిపాలెంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కడియం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 13 నుంచి వచ్చే ఏడాది జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహశీల్దారు కె.పోశిబాబు తెలిపారు. 13న దుళ్ల, 17న మురమండ, 19న దామిరెడ్డిపల్లి, 21న జేగురుపాడు, 24న మాధవరాయుడుపాలెం, 26న వీరవరం, 28న పొట్టిలంక, 31న కడియం, జనవరి 2న కడియపులంక, 4న కడియపుసావరం, 7న వేమగిరి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ సదస్సులు ఉపయోగించుకోవాలని తహశీల్దారు చెప్పారు.

భారీ అన్నసమారాధన

చాగల్లు, డిశంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు ముగింపు సందర్భంగా గురువారం స్థానిక ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిగింది. ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కమిటీ సభ్యులు భోజనాలను వడ్డించి కార్యక్రమంను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం భుజించారు.

గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించాలి

» జిల్లా ట్రైనింగ్ మేనేజర్ ప్రసంగిరాజు

» పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులకు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసంగిరాజు

గోపాలపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పని చేయాలని జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై రెండురోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో మొదటి రోజు గురువారం ఆయన ప్రారంభించారు. అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, సంక్షేమాభివృద్ధి పథకాలకు అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చేందుకు గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించాలన్నారు. 2020-30 నాటికి అన్ని స్థానిక ప్రభుత్వాలు సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీలు, సచివాలయాల సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు సామర్థ్య పెంపుదలకు కృషి చేయాలన్నా రు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా గ్రామ, మండల, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. దీనిపై ప్రభుత్వశాఖలతో సమన్వయం కోసం వివిధ శిక్షణ కార్యక్రమాలను జిల్లా, మండల, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 12నుంచి 20 వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48మండలాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సామర్లకోట ఈటీసీ నెంబరు ఎం.చక్రపాణిరావు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో టీఎస్ఎస్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15న మహాదన్ను సభ

శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు

చాగల్లు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) ఈనెల 15న మహా దన్ను సభ నిర్వహిస్తున్నట్టు శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తెలిపారు. బుధవారం రాత్రి చాగల్లు విచ్చేసిన ఆయన మండలంలోని సంఘ నాయకులను కలిసి ఆహ్వానం పలికారు. రాజమహేంద్రవరంలోని లాలా చెరువు వద్ద మధ్యాహ్నం 3గంటలకు శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన, యాత మహా దన్ను సభ జరుగుతుందని చెప్పారు. దివంగతనేత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణ, రాజమండ్రి టౌన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు అభినందన కార్యక్రమం, శెట్టిబలిజ కార్పోరేషన్ పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం జరుగుతాయని అన్నారు. అందరు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

17న కనకదుర్గమ్మ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బత్తుల



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రద్వారబంధం-సూర్యారావుపేట గ్రామ పొలిమేరల్లోనున్న కనకదుర్గమ్మ 44వ తీర్థ ఉత్సవాలను 17న నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం దర్శనమిస్తారు. ఈ ఏడాది అమ్మవారి తీర్థం నిర్వహణ పాటను రూ.7లక్షల 21 వేలకు చక్రద్వారబంధం గ్రామస్థులు దక్కించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మురారి దుర్గమ్మ తీర్థం తర్వాత సూర్యారావుపేట దుర్గమ్మ తీర్థం అంతటి ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బం దులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సుదీర్ఘ కాలం టీడీపీకి సేవలందించిన కార్యకర్తల కుటుంబాలు కష్టాల్లో ఉండటాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నేరుగా వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి ఆర్థికసాయం అందించారు. గురువారం రాజమహేంద్రవరం 13వ డివిజన్‌కు చెందిన చెక్క మరియమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకుని ఆమెను పరామర్శించి ఆర్థికసాయం చేశారు. ఇటీవల మరణించిన రాయుడు రవితేజ, పిల్లి కుమార్, సీహెచ్ పాపమ్మ కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పల వెలుగు కుమారి, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొర్రా చిన్ని, ఉపాధ్యక్షుడు రాయి అప్పన్న, డివిజన్ ప్రెసిడెంట్ నగరబోయిన రామకృష్ణ, నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, మళ్లేల శ్రీనివాస్, వై.దీవీప్రసాద్, పసుపులేటి కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం వాసులకు గద్దర్ పురస్కారాలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన దళిత నేతలు, అంబేడ్కర్ వాదులు కోరుకొండ చిరంజీవి, ధారా యేసురత్నం, విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు గొట్టిముక్కల అనంతరావులకు గద్దర్ జాతీయ జీవిత సాఫల్య పురస్కారాలు అందించారు. గురువారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపకులు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో జరిగిన సభలో దశాబ్ద కాలంగా ప్రజల పక్షాన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డులను అందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ చేతుల మీదుగా పురస్కారాలను అందించారు. ఈ సభకు హాజరైన శ్రీశ్రీ కళావేదిక డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు టీవీవీ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి, జడ్పీటీసీ ప్రసన్నకుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ అరిగెల బలరామ్మూర్తి పురస్కార గ్రహీతలను అభినందించారని రాజమండ్రి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.



అనంతరావుకు గద్దర్ జాతీయ జీవిత సాఫల్య పురస్కారం అందిస్తున్న గద్దర్ కుమార్తె వెన్నెల



కొప్పవరంలో విచారణ చేస్తున్న దుర్గాప్రసాద్

ఏఎన్ఎమ్ భర్తపై విచారణ

అనపర్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కొప్పవరం గ్రామంలో బుధవారం వెల్‌నెస్ సెంటర్ వద్ద జరిగిన ఘటనపై గురువారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ జరిపారు. జిల్లా డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు వెల్‌నెస్ సెంటర్ వద్ద ఘటనపై కుతుకులూరు హెల్త్ ఆఫీసర్ దుర్గాప్రసాద్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మణికంఠరెడ్డి తమ కుమార్తెకు విటమిన్ డ్రాప్స్ వేయించేందుకు సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అని పరిశీలించేందుకు వెల్‌నెస్ సెంటర్‌కు చేరుకున్నాడు. అప్పటికీ సెంటర్ తెరవక పోవడంతో అక్కడే ఉన్న ఏఎన్ఎమ్ భర్తను ఆరా తీయగా మద్యం మత్తులో ఉన్న అతను మణికంఠపై దుర్భాషలాడి దౌర్జన్యానికి యత్నించడంతో ఆయన జిల్లా ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డాక్టర్ దుర్గాప్రసాద్ విచారణ జరిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. ఈ ఘటనపై చర్యలు చేపట్టాలని సర్పంచ్ కర్రి బులిమోహనరెడ్డి విచారణాధికారిని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సీతానగరం, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం, ముగ్గళ్ళ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవీ సీతానగరం ఎంహెచ్‌క్యూ, రఘుదేవపురం ఫీడర్‌కు మరమ్మతులు నిమిత్తం నేడు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఆయన వివరాల మేరకు శుక్రవారం రఘుదేవపురం, రవీంద్రనగర్ కాలనీ, రాపాక గ్రామాలతో పాటు ఈ ఉపకేంద్రంలోని వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

శివమిత్ర బృందం రక్తదానం



రక్తదానం చేస్తున్న శివమిత్ర బృందం

కడియం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చిరంజీవి సేవాసమితి అధ్యక్షులు గెద్దం శివరత్న గణపతి మిత్ర బృందం గురువారం పలు సేవా కార్యక్రమాలు తలపెట్టారు. రాజమహేంద్రవరం ధన్వంతరీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. రాజమహేంద్రవరం ప్రియదర్శిని పాఠశాల చిన్నారులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న శివను, మిత్ర బృందాన్ని పలువురు అభినందించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

అనపర్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి ఎం.మాధురి అన్నారు. గురువారం పెడపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆమె అర్జీలు తీసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సులో విస్తీర్ణత తగ్గుదలకు సంబంధించి తొమ్మిది దరఖాస్తులు వచ్చినట్టు తహశీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఎం.నాగలత, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

‘అక్రమ లీజులో అవినీతికి పాల్పడిన భరత్‌రామ్’

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఉన్న గౌతమిసూపర్ బజార్ స్థలాన్ని లీజుకిచ్చిన విషయంలో మాజీ ఎంపీ భరత్‌రామ్ అవినీతికి పాల్పడ్డారని టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ లీజు వ్యవహారాన్ని తమ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బయటపెడితే దానిపై పరువునష్టం దావా వేస్తాననడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దీనిపై మంత్రి అచ్చెన్నాయుడుకి ఫిర్యాదు చేశారని త్వరలో విచారణ చేపడతారని అప్పుడు తెలుస్తుందన్నారు.

15న దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం ఆవిష్కరణ: ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకారంతో లాలాచెరువు సెంటర్‌లో ఏర్పాటు చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని 15న ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. ముఖ్య అతిథులుగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఆవిష్కరణ ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు కడలి రామకృష్ణ, పిల్లి శ్యామ్, చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, దాస్యం ప్రసాద్, కడియాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహాన్నదానంతో ముగిసిన షష్ఠి ఉత్సవాలు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలు గురువారం ముగిసాయి. గ్రామానికి చెందిన పల్లి సుబ్బారెడ్డి పద్మావతి దంపతుల ఆర్థికసహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన షష్ఠి ఉత్సవాల్లో సేవలందించిన 30 మంది పంచాయతీ పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లను సత్కరించారు. అనంతరం భక్తులతో కలసి ఆయన అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. పదివేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ చాగంటి సాయిబాబా రెడ్డి, కూటమి నేతలు రావాడ నాగు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి తదితరులతో పాటు బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్, ఆలయ ఈఓ ఆకెళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కోరుకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం బుచ్చింపేటలో గురువారం రాత్రి క్రిస్మస్ వేడుకలు జరిపారు. ఎస్ఆర్ఎస్ ఫామ్ హౌస్ వద్ద గ్లోరియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చోడదాసి విల్సన్ డేవిడ్ రాజు, ఆయన సతీమణి అమ్మాజీల సహకారంతో క్రిస్మస్ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు, అమ్మాజీలు మాట్లా డారు. కార్యక్రమంలో దైవజనులు ఏసుక్రీస్తును ఆరాధిస్తూ పాల్గొన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. సంఘ కాపరులు పాస్టర్స్‌చే నూతన వస్త్రాలు అందజేశారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

సీతానగరం, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం, రాపాక గ్రామంలోని కందుకూరి సత్యనారాయణ తాటికిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమయింది. శుక్రవారం ఉదయం 6 గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో స్థానికులు పక్కనే ఉన్న పంటకాలువ నుంచి నీటిని తెచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లోని ఫ్యాన్లు, టీవీ, దుస్తులు వంట సామగ్రి దగ్ధం కాగా పరుపు కింద పెట్టిన రూ.20 వేల నగదు కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం రూ.4 లక్షల వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు.

జీతాలు అందక

‘నన్నయ’ సిబ్బంది ఇక్కట్లు

దివాన్‌చెరువు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగులకు నవంబరు నెలకు సంబంధించిన జీతం రాకపోవడంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిసెంబరు నెల 12 రోజులు గడిచినప్పటికీ జీతాలు రాక అనేక ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. నన్నయ విశ్వవిద్యాలయం స్థానిక క్యాంపస్‌తోబాటు తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలో దాదాపు నాలుగు వందల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి వేతనాల చెల్లింపునకు కోటి 50 లక్షల వరకూ అవసరం ఉంటుందని తెలిసింది. ఈనెల జీతాల జాప్యానికి ఉద్యోగులు కొందరు పలు రకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్‌ను దీనిపై సంప్రదించగా రెండు రోజుల్లో ఉద్యోగుల జీతాలను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి యదావిధిగా జీతాలు విడుదలయ్యాయని తెలిసింది.

అన్న సమారాధన

రాజానగరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజానగరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 98వ షష్ఠి ఉత్సవాల ముగింపు సందర్భంగా బలభద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిపారు. ఈ సమారాధనలో గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ నెల 7న ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన షష్ఠి ఉత్సవాలను ఐదు రోజులపాటు వైభవంగా జరిపారు. ఈ ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చి సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆఖరి రోజున స్వామివారి సదస్యం క్రతువును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, దివ్య, గాయత్రి కళాశాలలకు చెందిన విద్యార్థులు సేవలందించారు.



గగనంలో చలో చలో ఢిల్లీకి..



ప్రొటోకాల్‌లో భాగంగా తొలి విమాన సర్వీసుపై వాటర్‌ను వెదజల్లుతూ స్వాగతిస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి ఇండిగో తొలి విమాన సర్వీసుకు మొదటి టిక్కెట్టును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుమారుడు సంజీవ్‌కు అందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమానం

ప్రారంభమైన ఇండిగో ఫ్లైట్ సర్వీసులు

విమాన సర్వీసును ప్రారంభించిన

కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు గురువారం ప్రారంభమయ్యాయి. మధురపూడిలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈ సర్వీసులను ప్రారంభించగా.. ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈనెల ఒకటిన ముంబైకి సర్వీసులు ప్రారంభమైన సంగతి తెలిసిందే..

- 7లో





ముఖ్యమంత్రితో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి.. ఐఏఎస్, ఐపీఎస్‌ల మీట్‌లో మన కలెక్టర్, ఎస్పీలు ప్రశాంతి, నరసింహకిషోర్

గోదావరి పుష్కరాలపై ప్రస్తావన

- ఘాట్ల నిర్మాణాలపై చర్చించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- సత్యసాయి వాటర్ స్కీమ్ పై కూడా కలెక్టర్ ప్రస్తావన
- ముగిసిన రెండురోజుల సదస్సు

రాజమహేంద్రవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాల 2027 ఆగస్టులో జరగనున్నందున దానికోసం గోదావరి గోదావరి ఘాట్లను అభివృద్ధి చేయవలసి ఉందని, రాజమహేంద్రవరం వైపు 4 కిలోమీటర్లు, కొవ్వూరు వైపు 3.5 కిలోమీటర్ల మేర ఘాట్లను అభివృద్ధి చేయవలసి ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై చంద్రబాబు వెంటనే స్పందించి దీనిపై చర్చించారు. అమరావతిలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రెండురోజులపాటు జరిగిన కలెక్టర్ల సదస్సులో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ ప్రశాంతి జిల్లాకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించారు. గోదావరి ఘాట్లను ఏ శాఖ నిర్వహిస్తున్నది.. ఇరిగేషనేనా, ఇతర పనులు గతంలో ఎవరి ఆధ్వర్యంలో జరిగాయని చంద్రబాబు ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఘాట్లను ఇరిగేషన్ శాఖ నిర్మిస్తే, పుష్కర ఏర్పాట్లన్నీ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జరిగినట్టు చెప్పారు. అయితే ఈసారి కూడా గతంలో మాదిరిగానే ఆయా శాఖల ఆధ్వర్యంలోనే నిర్వహిద్దామని చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. దీంతో కాసేపు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పి.నారాయణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మధ్య చర్చ జరిగింది. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ శ్రీ సత్యసాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీటి పథకం నిర్వాహకులు, సిబ్బందికి వేతనాలు చెల్లింపు, పీఎఫ్ చెల్లించకపోవడం వల్ల పథకం అమలులో సమస్యలు వచ్చాయని, తాళ్లపూడి మండలంలో మంచినీటి సమస్య ఉందన్నారు. సీఎం చంద్రబాబు స్పందించి మంత్రిని వివరణ అడిగారు. కాసేపు చర్చ జరిగింది. ఎలా అమలు చేయాలనేదానిపై సమీక్షించారు. మళ్లీ కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు మెట్ట ప్రాంతాలకు గత రెండు దశాబ్దాలుగా మంచినీటి ఈ పథకం ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. 2021 నుంచి సకాలంలో జీతాలు చెల్లించకపోవడం వల్ల సిబ్బంది సమ్మె దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు. ఇక ఆక్వా ఉత్పత్తుల సాగు పద్ధతులు, వినియోగం, మార్కెటింగ్, ల్యాండ్ కన్వర్షన్ తదితర అంశాలను కూడా కలెక్టర్ ఈ సదస్సులో ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, యువతకు ఆయా విభాగాల్లో నైపుణ్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. లోతట్టు, ముంపు ప్రాంతాల్లో రైతులు దిగుబడి తక్కువగా వస్తుందని చెబుతున్నారని, ఆయా భూముల్లో పీహెచ్ పరీక్షలు నిర్వహించవలసి ఉందన్నారు. ఏడాదికి ఏడాదికి దిగుబడి తగ్గుతున్న దృష్ట్యా ఆయా భూయజమానులు ల్యాండ్ కన్వర్షన్ కోసం కోరుతున్నారన్నారు. పీహెచ్ పరీక్షలు కోసం ప్రభుత్వపరంగా చేయూత అవసరమని, ప్రైవేట్ వ్యక్తులు రూ.20 వేల నుంచి 25 వేల రూపాయల వరకూ తీసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వపరంగా చేయూత ఇవ్వడానికి యువతలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు అకడమిక్ బోధనతోపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, రెండు మూడు బ్యాచ్‌లను తయారుచేసి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పరీక్షలు నిర్వహించ వచ్చన్నారు. ఆక్వా కల్చర్‌కు అంతర్జాతీయ మార్కెట్‌ను ప్రోత్సహించడానికి ధరల స్థిరీకరణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ కోరారు. తర్వాత సీఎం చంద్రబాబునాయుడుతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ ఇద్దరూ సంయుక్తంగా పాల్గొన్నారు.

గ్రీన్ సిగ్నల్!



భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైనుకు మోక్షం

నిర్మాణానికి రూ.2 వేల 155 కోట్లు

ఎంపీ పురందేశ్వరికి రైల్వే మంత్రి లేఖ

ఇన్నాళ్లు స్థానికులు పడిన కష్టాలకు తగిన ఫలం

ఏజెన్సీ మీదుగా ఇక రైలు కూతలే

కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైనుకు కేంద్రం తగినంత బడ్జెట్ కేటాయించింది. చిన్నపాటి మార్పులతోనే ఈ రైల్వే మార్గం పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేశారు. రాబోయే ఐదేళ్లల్లోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సంకల్పించారు. భారీ అంచనా వ్యయంతో ప్రాజెక్టు మంజూరు చేస్తున్నట్టుగా రైల్వే మంత్రి రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరికి రాత పూర్వకంగా తెలిపారు. ఏజెన్సీ మీదుగా సాగే ఈ రైల్వే మార్గం పూర్తయితే దూర భారం తగ్గుతుంది.

(ఆంధ్రజ్యోతి- ఏలూరు/కొవ్వూరు)

కొవ్వూరు-భద్రాచలం రైల్వే మార్గం విషయంలో సర్వేల పేరిట దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగానే కాలయాపన జరిగింది. కొవ్వూరు-భద్రాచలం మధ్య అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండడం, రైల్వే లైను నిర్మించాలంటే కొండ వాగులు, పిల్ల వాగులపై దాదాపు 120 చోట్ల బ్రిడ్జిలు కట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రాజెక్టు వ్యయంలో సగభాగం వీటి నిర్మాణానికే ఖర్చయ్యేది. అందుకనే రైల్వే మంత్రిత్వ శాఖ ఈ రైల్వే మార్గంపై సర్వేలతోనే సరిపుచ్చింది. తొలిసారిగా 1960లో సర్వే సాగింది. ఈ మార్గంకు ఉన్న ప్రాధాన్యతను అప్పుడు జరిగిన సర్వేలో నివేదించారు. అయినా రిజర్వు ఫారెస్టు భాగం ఎక్కువగా ఉండడంతో అటవీ, పర్యావరణ అనుమతులు తప్పవని, దీనికి భిన్నంగా ఏదైనా ఆలోచన చేయవచ్చునన్న ధోరణిని రైల్వేశాఖ ప్రదర్శిస్తూ వచ్చింది. ప్రతీ బడ్జెట్‌లోను ఈ రైల్వే లైను ప్రస్తావన సాగుతున్నా బడ్జెట్‌లో రూపాయి విదల్చడంలేదు. గడిచిన పదేళ్లుగా కేవలం సర్వే, ఇతర పనుల నిమిత్తం రూ.40 కోట్లకు వరకు కేటాయించారు. ఈ స్వల్ప బడ్జెట్ కేటాయింపులతో రైల్వే ప్రాజెక్టుకు నీళ్లొదులుకోవాల్సిందేనని అందరూ భావించారు. గతంలో ఎంపీలుగా ఉన్న వారంతా ఈ రైల్వే లైను కోసం పార్లమెంటులో పట్టుపడుతూ వచ్చారు. ప్రధాని దగ్గర నుంచి రైల్వేమంత్రి వరకు వినతులు అందజేశారు. అయినప్పటికీ రైల్వే శాఖ మాత్రం చూద్దాం.. చేద్దాం అన్నట్టుగానే వ్యవహరించింది. ఈ పరిస్థితులపై రాష్ట్రం- రైల్వే జనరల్ మేనేజర్‌తో ఏటా జరిగే కో-ఆర్డినేషన్ కమిటీల్లో ప్రస్తావనకు తెచ్చేవారు. ఈ క్రమంలోనే గత దశాబ్దకాలంగా తెలంగాణ రాష్ట్ర పరిధిలోని సత్తుపల్లి పరిసరాల్లో బొగ్గు నిక్షేపాలు బయటపడ్డాయి. దీంతో సింగరేణి కాలరీస్ పరిధిలోకి ఈ భూభాగమంతా చేరింది. అప్పటి నుంచి బొగ్గు తవ్వకాలు కాస్తంత వేగం పుంజుకున్నాయి. ఈ తరుణంలో సత్తుపల్లిలో లభించే బొగ్గును ఇతర ప్రాంతాలకు తరలించాలంటే రైళ్లే అనుకూల రవాణా. దీంతో కొత్తగూడెం-సత్తుపల్లి మధ్య కాస్ట్ టూ కాస్ట్ షేరింగ్ పద్ధతిలో సింగరేణి యాజమాన్యం రూ.706 కోట్లు ఖర్చు భరించగా, సౌత్ సెంట్రల్ రైల్వే తన వాటా రూ.85 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. దీంతో పనులన్నీ పూర్తయ్యి సత్తుపల్లి- కొత్తగూడెం మధ్య రైల్వే మార్గం క్లియర్ అయ్యింది. ఇప్పుడు కొవ్వూరు-సత్తుపల్లి మధ్య రైల్వేలైను నిర్మిస్తే కొంత ప్రతిపాదిత వ్యయం తగ్గడమే కాకుండా రాబోయే ఐదేళ్లల్లోనే పనులు పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు- భద్రాచలం రోడ్డు లైను నిర్మాణానికి వీలుగా 2 వేల 155 కోట్లు ప్రతిపాదిత వ్యయం గుర్తించి మంజూరు చేస్తున్నట్టు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి రాతపూర్వకంగా తెలిపారు. ఇన్నాళ్ల రైల్వే బడ్జెట్‌లో ఈ తరహా పద్దు ఎక్కడా కనిపించకపోగా ఇప్పుడు తాజాగా రైల్వే మంత్రి వైష్ణవ్ నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించడంతో హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకించి ఈ రైల్వే మార్గం నిడివి 165 నుంచి 119 కిలోమీటర్లకు తగ్గింది కూడా. అలాగే కొంత అలైన్‌మెంట్‌లో మార్పులు, చేర్పులు చేసి సత్తుపల్లి-దేవరపల్లి వరకు ఇప్పటికే గ్రీన్‌ఫైవే నిర్మిస్తున్నందున దానికి సమాంతరంగా కొత్త రైల్వే లైనుకు దాదాపు రూటు క్లియర్ అయినట్టే. ఎప్పటినుంచో ఈ లైను కోసం పోరాడుతున్న వారికి తాజా బడ్జెట్ కేటాయింపు నిర్ణయం సంతృప్తినిచ్చింది. ఇంతకుముందున్న పరిస్థితులు మారి ఇప్పుడు టి.నర్సాపురం, పుట్టగట్లగూడెం మీదుగా ఈ రైల్వే లైను వెళ్లబోతోంది.



మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

మృతికి వైద్యులే కారణమంటూ గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన

గోకవరం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): మళ్లీ అదే తీరు.. అదే నిర్లక్ష్యం. అప్పుడు నిండు గర్భిణీ మృతి చెందగా, తాజాగా మరో వ్యక్తి ప్రాణాలు విడిచాడు. అయినప్పటికీ ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదు. గోకవరం ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. ఆసుపత్రికి ఏ డాక్టర్ ఎప్పుడు వస్తారో, ఎంత సమయం వరకు ఉంటారో ఎవరికీ తెలియదు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే సిబ్బంది కనిపించడం లేదు. గత నెల నవంబరు 23న ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిన నిండు గర్భిణీ పుట్టిన బిడ్డను కూడా చూడకుండానే ఇదే ఆసుపత్రిలో మృతి చెందింది. ఆసమయంలో గర్భిణీ మృతిపై మృతురాలు బంధువులు నోరు మెదపనప్పటికీ, బయట వ్యక్తుల నుంచి మాత్రం వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె ప్రాణాలు విడిచిందనే ఆరోపణలు వినిపించాయి. ఇప్పుడు తాజాగా అటువంటి ఘటనే ఈ ఆసుపత్రిలో చోటు చేసుకొంది. గోకవరంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన కాళ్ళ రాజమల్లి (35) అనే వ్యక్తి కుటుంబ తగాదాల కారణంగా గురువారం తెల్లవారుజామున ఇంటి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది బాధితుని పట్ల నిర్లక్ష్యమైన ధోరణి ప్రదర్శించారని, కనీసం ప్రథమ చికిత్స కూడా అందించకుండానే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించాలని తెలిపినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు రాజమల్లిను ప్రైవేట్ వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసికెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు రాజమల్లి మృతదేహంతో తిరిగి గోకవరం ప్రభుత్వాసుపత్రికి చేరుకొని ఆందోళనకు దిగారు. సక్రమంగా వైద్యం అందకపోవడంతోనే రాజమల్లి మృతిచెందాడని, అతడి మృతికి కారకులైన వైద్యులు, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ పట్టుబట్టారు. కనీసం బాధితుడు చెయ్యి పట్టుకునే ప్రయత్నం కూడా వైద్యులు చేయలేదంటూ మృతుని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో ఆసుపత్రి వద్ద జన సమూహం విపరీతంగా పెరగడంతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో చివరకు పోలీసులు రంగంలోకి దిగి అప్పటికే పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆసుపత్రికి వచ్చిన డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణితో పోలీసులు చర్చలు జరిపారు. సీసీ పుటేజ్‌ను పరిశీలించి తద్వారా బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. రాజమల్లికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సదస్సుల సందడి

- జిల్లాలో 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
- తొలిరోజు 386 అర్జీలు స్వీకరణ
- రాజమండ్రి డివిజన్‌లో 149, కొవ్వూరు డివిజన్‌లో 237 అర్జీలు
- కొవ్వూరులో 42 అర్జీలు అక్కడికక్కడే పరిష్కారం

(రాజమహేంద్రరం -ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రెవెన్యూ సదస్సులు సందడిగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జిల్లాలో 23 చోట్ల రెవెన్యూ సదస్సులు నిర్వహించి అక్కడ ప్రజల ద్వారా 386 అర్జీలు స్వీకరించినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రాజమండ్రి డివిజన్ నుంచి 149 అర్జీలు స్వీకరించారు. కొవ్వూరు డివిజన్ నుంచి 237 అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా రీసర్వేకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. ఇతర సమస్యలకు సంబంధించి రాజమండ్రి డివిజన్‌లో 83, కొవ్వూరు డివిజన్‌లో 101 అర్జీలురాగా, కొవ్వూరులో 42 అర్జీలు అక్కడికక్కడే పరిష్కరించడం గమనార్హం. ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రాల్లో పేరు మార్పులు, రికార్డు ఆన్ రైట్స్ (ఆర్వోఆర్)కు, 22ఎ నుంచి మినహాయింపు, భూమి తగాదాలు వంటివి ఎక్కువ వచ్చాయి. ఈ సదస్సులలో జిల్లాలోని ఈ సదస్సుల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, రాజమండ్రి ఆర్డీవో కృష్ణనాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుష్మిత తదితరులు హాజరయ్యారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం పరిధిలోని కాతేరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



దోసకాయలపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

ప్రతి అర్జీకి 33 రోజుల్లోగా పరిష్కారం

దోసకాయలపల్లి రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

కోరుకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులు, ప్రజల భూసమస్యలు నిర్ణీతకాలంలో పరిష్కారం అయ్యేవిధంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు తెలిపారు. గురువారం కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఉద్దేశించి జిల్లావ్యాప్తంగా 272 రెవెన్యూ గ్రామ పంచాయతీల పరిధిలో గురువారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలిరోజు జిల్లాలో 23 గ్రామ సదస్సులు నిర్వహించి ప్రజలు, రైతుల నుంచి 386 అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. రాజమండ్రి డివిజన్‌లో 149, కొవ్వూరు డివిజన్‌లో 237 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. ప్రతి అర్జీకి 33 రోజుల్లోగా పరిష్కారం లభిస్తుందని జేసీ తెలిపారు. సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ సదస్సులో సమస్య పరిష్కారంకోసం ఇచ్చే అర్జీదారులు అధికారులకు తగిన పత్రాలు అందజేయాలని కోరారు. భూ సంబంధ సమస్యల పరిష్కార విధానంలో రెవెన్యూ సదస్సులు చక్కటి వేదిక అని పేర్కొన్నారు. కోరుకొండ మండల పరిధిలో ఒక రెవెన్యూ సదస్సు నిర్వహించగా, అందులో 21 మంది అర్జీలు అందజేశారన్నారు. జిల్లా, డివిజన్, పరిధిలో సమస్య పరిష్కారంకోసం చాలామంది తమను కలిసి అర్జీ ఇవ్వడం జరుగుతోందన్నారు. మండల కేంద్రంలో అర్జీలు ఇవ్వడం వల్ల వాటి పరిష్కారంకోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ ధారా యశోదమ్మ, ధారా రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

15న చాగల్లులో మహాదన్ను సభ

- 8లో

శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు

మద్యం షాపుల్లో అన్ని రకాల బ్రాండ్లు

- ఎక్సైజ్‌శాఖ జిల్లా కమిషనర్ చైతన్య మురళి
- చాగల్లు ఐఎంఎల్ డిపో పరిశీలన

- 8లో

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

మద్యం షాపుల్లో అన్ని రకాల బ్రాండ్లు

● ఎక్సైజ్‌శాఖ జిల్లా కమిషనర్ చైతన్య మురళి ● చాగల్లు ఐఎంఎల్ డిపో పరిశీలన


హమాలీలతో మాట్లాడుతున్న కమిషనర్ చైతన్యమురళి

చాగల్లు, డిశంబరు 12 (ఆంధ్రజ్యోతి): చాగల్లు ఐఎంఎల్ డిపోను జిల్లా ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చైతన్య మురళి గురువారం సందర్శించారు. నెలవారి తనిఖీల్లో భాగంగా డిపోను సందర్శించిన ఆయన డిపోను పరిశీలించి సరుకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాయకష్టం చేసుకొనే వారికి రూ. వంద, రూ.130 ధరలలోను పలు రకాల బ్రాండ్లు అందుబాటులో ఉంచామన్నారు. డిపోలో సరుకు నిల్వ కోసం అదనంగా షెడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు చెప్పారు. డిపో పరిధిలో 111 షాపులు ఉన్నాయని వాటి నిర్వహణ, పనితీరును సక్రమంగా ఉండేలా షాపులను, స్టేషన్లను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. డిపో మేనేజర్ రామకృష్ణ దాస్ పాల్గొన్నారు. డిపోలో పనిచేసే హమాలీలతోను మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నిడదవోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సీజీఆర్ఎఫ్ కృషి చేస్తోందని చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. గురువారం నిడదవోలులోని విద్యుత్ శాఖ డివిజినల్ ఇంజనీరింగ్ కార్యాలయంలో వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించి పలువురు వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.మణి, షేక్ బాబర్, ఎస్. నారాయణ అప్పారావు తదితర్లు పాల్గొన్నారు.

15న మహాదన్ను సభ


చాగల్లులో కరపత్రాలను ప్రదర్శిస్తున్న సత్తిబాబు తదితరులు

చాగల్లు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) ఈనెల 15న మహా దన్ను సభ నిర్వహిస్తున్నట్టు శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తెలిపారు. బుధవారం రాత్రి చాగల్లు విచ్చేసిన ఆయన మండలంలోని సంఘ నాయకులను కలిసి ఆహ్వానం పలికారు. రాజమహేంద్రవరంలోని లాలా చెరువు వద్ద మధ్యాహ్నం 3గంటలకు శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశైన, యాత మహా దన్ను సభ జరుగుతుందని చెప్పారు. దివంగతనేత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణ, రాజమండ్రి టౌన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు అభినందన కార్యక్రమం, శెట్టిబలిజ కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం జరుగుతాయని అన్నారు. అందరు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు
మహమ్మద్‌కు డాక్టరేట్



కొవ్వూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న సాధిక్ అహ్మద్ మహమ్మద్‌కు కృష్ణ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. సాధిక్ సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథం సోల్ జెల్ మార్గం ద్వారా సంశ్లేషణ చేయబడిన వైఎఫ్ఈ03 పదార్థాల నిర్మాణ, ఆప్టికల్, అయస్కాంత, విద్యుద్వాహక ప్రతిస్పందనలపై గ్లాస్ సింటరింగ్ ప్రభావంపై విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందించింది. ఈ సందర్భంగా మహమ్మద్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ కె.నాగ సూర్యనారాయణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

నిడదవోలులో రైల్వే ట్రాక్ మరమ్మతులు


నిడదవోలు రైల్వేగేటు వద్ద జరుగుతున్న మరమ్మతులు

నిడదవోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని నెహ్రూబొమ్మ సెంటరులో రైల్వేగేటును గురువారం రైల్వే అధికార్లు మూసివేసి ట్రాక్ మరమ్మతు పనులు నిర్వహించారు. దీంతో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక పక్క రైల్వే ట్రాక్ పనులు వేగంగా జరుగుతుండగా నిడదవోలు, తాడేపల్లిగూడెం బస్సు ద్వారా రాకపోకలు సాగించే ప్రయాణికులు రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఏర్పాటు చేసిన బస్సులు ఎక్కేందుకు మరమ్మతులు జరుగుతున్న రైల్వే ట్రాక్ మీదుగానే రాకపోకలు సాగించవలసి వచ్చింది. గురువారం రాత్రికి పనులు పూర్తి అయితే శుక్రవారం నుంచి రైల్వేగేటు మీదుగా రాకపోకలు జరుగనున్నాయి.

సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసంగిరాజు

గోపాలపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పని చేయాలని జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై రెండురోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో మొదటి రోజు గురువారం ఆయన ప్రారంభించారు. అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలకు అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చేందుకు గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించాలన్నారు. 2020-30 నాటికి అన్ని స్థానిక ప్రభుత్వాలు సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీలు, సచివాలయాల సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు సామర్థ్య పెంపుదలకు కృషి చేయాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా గ్రామ, మండల, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. దీనిపై ప్రభుత్వశాఖలతో సమన్వయం కోసం వివిధ శిక్షణ కార్యక్రమాలను జిల్లా, మండల, క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 12నుంచి 20 వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48మండలాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సామర్లకోట ఈటీసీ నెంబరు ఎం. చక్రపాణిరావు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎస్ఎస్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


వేలచింతలగూడెంలో ప్రత్యేకాధికారికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గోపాలపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేలచింతలగూడెం గ్రామంలో సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సును గురువారం నిర్వహించారు. తహశీల్దార్ కే.అజయ్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలతో పాటు 22ఏలో ఉన్న భూసమస్యల పరిష్కారానికి ఈ సదస్సుల్లో వినతులు స్వీకరిస్తామన్నారు. వేలచింతలగూడెం రెవెన్యూ పరిధిలో నిర్వహించిన సదస్సు మూడు వినతులు అందాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కొర్లపాటి రాము, ఇల్లూరి రాము, పరిమి జగదీష్, సర్పంచ్ దండియ్య, ఆర్ఐ హరీష్, వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గోపాలపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈఈ ఎన్.నారాయణఅప్పారావు గురువారం తెలిపారు. గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న భీమోలు, గుడ్డిగూడెం, నందిగూడెం, గోపాలపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

భారీ అన్నసమారాధన

చాగల్లు, డిశంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు ముగింపు సందర్భంగా గురువారం స్థానిక ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిగింది. ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కమిటీ సభ్యులు భోజనాలను వడ్డించి కార్యక్రమంను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి అన్నప్రసాదం భుజించారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

» కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత
» గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
» సమస్యలపై రైతులు, గ్రామస్థుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ



కొవ్వూరు: దొమ్మేరు సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో సుస్మిత

కొవ్వూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామ సచివాలయంలో గురువారం రైతు సదస్సు నిర్వహించి, రైతుల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్డీవో మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూ వివాదాలు, 22ఏ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణల సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చునన్నారు.ఈ సదస్సుల ద్వారా గ్రామాల్లో భూ వివాదాలను తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. 33 రోజుల్లో భూ వివాదాలు కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సదస్సుల్లో స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కారానికి రోజువారీగా పరిశీలన చేసి, బాధితులకు తెలుగులో రశీదు, తిరిగి సమాధానమిచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల స్థాయి అధికారులు షెడ్యూల్ ప్రకారం గ్రామ సచివాలయాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో ప్రజలకు అందుబాటులో ఉండి భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తానేటి కుమారి, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, దేవదాయశాఖ అధికారి ఎం. సూర్యప్రకాశరావు, రీసర్వే డీటీ ఎస్.కృష్ణ, సీఐ పి. విశ్వం, ఎంపీటీసీ ఎ.సరోజిని, ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎనిమిది మంది రైతులు సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైస్ ఎంపీపీ కోదాటి కనకం, డీటీ భారతి, ఆర్.రామకృష్ణ, వీఆర్వో లీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని దారవరంలో జరిగిన సదస్సుకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేసి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమాలను సరిచేయడం, రీసర్వే పేరుతో జరిగిన ఆక్రమణలు, తప్పులను సరిచేయడం కోసం రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సదస్సుకు నాలుగు దరఖాస్తులు వచ్చినట్టు తహశీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, టీడీపీ నాయకులు నాదెళ్ల శ్రీరామ్, బొడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: బందపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సదస్సుకు తహశీల్దార్ రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందన్నారు. సరిహద్దు తగాదాలు వంటివి ఈ సదస్సులో పరిష్కరిస్తారన్నారు. ఈ సందర్భంగా 17 సమస్యలు సభ దృష్టికి వచ్చాయని, వాటిలో ప్రధానంగా భూ సమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ చెప్పారు. స్థానిక రైతులు తమ భూమి రీసర్వేలు తప్పులతడకగా ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, డీటీ శ్రీనివాస్, సర్పంచ్ కాట్రగడ్డ గాంధీ, కార్యదర్శి షరీఫ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెరవలి: కాకరపర్రులో తహశీల్దార్ అచ్యుత కుమారి సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముందు ఆమె గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరికి ఇబ్బందులున్నా దరఖాస్తుల ద్వారా తమకు తెలియజేయాలని వాటికి పరిష్కార మార్గాలు చూస్తామని పేర్కొన్నారు. అనంతరం జరిగిన రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలపై పది దరఖాస్తులు వచ్చాయి. వాటిలో నాలుగు రేషన్‌కార్డులకు సంబంధించి కాగా రెండు పాసుబుక్‌లు, ఒకటి ఆక్రమణల తొలగింపునకు, మిగిలినవి లంక భూముల్లో పట్టాల కోసం వచ్చాయి. కార్యక్రమంలో ఆర్ఐ పావని, వీఆర్‌వో మమత, నాయకులు పాల్గొన్నారు.

నల్లజర్ల: పోతినీడుపాలెంలో జరిగిన సదస్సులో రైతులు పలు సమస్యలపై అధికారులకు ఫిర్యాదు అందించారు. మ్యూటేషన్స్, సర్వేలు,భూవిస్తర్ణలో లోపాలు వంటి సమస్యలను అధికారులకు వివరించారు. త్వరలోనే భూ సమస్యలను పరిష్కరిస్తామని డిప్యూటీ తహశీల్దార్ శాంతిప్రియ రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పిచ్చుకల గణపతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను, వెలగదుర్రు గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలుంటే ఈ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దమ్మెన్నులో 5, వెలగదుర్రులో 2 ఫిర్యాదులు ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తాళ్లపూడి సదస్సులో పాల్గొన్న అధికారులు, నాయకులు



బందపురంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి


కాకరపర్రులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం


పోతినీడుపాలెంలో రెవెన్యూ సదస్సు


దమ్మెన్నులో రెవెన్యూ సదస్సు



చాగల్లు: దారవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

గ్రామాల సుస్థిరాభివృద్ధికి కృషి

» కొవ్వూరు ఎంపీడీవో సుశీల
» పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులకు శిక్షణ


దేవరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి

కొవ్వూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల సుస్థిర అభివృద్ధికి అధికారులు సమష్టిగా పాటుపడాలని ఎంపీడీవో కె.సుశీల అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చిడిపి, కుమారదేవం, ఆరికిరేవుల, పెనకనమెట్ట, ధర్మవరం గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈవోపీఆర్డీ కె.ఉమా మహేశ్వరశర్మ శిక్షణ అందించారు. ఏపీఎం రత్నకుమారి గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక సుస్థిరత, జీవన ప్రమాణాల పెంపుదలకు తీసుకోవలసిన అంశాలను వివరించారు. సీడీపీవో డి.మమ్మీ బాలల వికాసం, ఎంపీహెచ్‌వో శ్రీనివాస్ ఆరోగ్యంపై శిక్షణను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ త్రిమూర్తులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యక్రమానికి ఎంపీడీవో వెంకటరమణ అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు అన్ని వసతులూ కల్పించడంతో పాటు వారికి జీవనోపాధి, అభివృద్ధి సాధించే దిశగా సుస్థిర అభివృద్ధి పథకాల పేరుతో శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం మంగాయమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్య కుమారి, ఎస్ఐ టి.రామకృష్ణ పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు. రిసోర్సుపర్సన్ శ్రీనివాస్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తోందని, కాని ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. మరింత బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్‌లుగా తిలక్, నరేంద్ర, శ్రవణ్‌కుమార్, ఎం.లావణ్య పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పంచాయతీ ఆదాయాభివృద్ధికి వనరులు సమకూర్చుకోవాలని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎన్.రవి కిషోర్, రామచంద్రరావు, ఏపీవో నాగ లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ రాజారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కుమారి, డీఆర్ ఏఈ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీఎస్ రామారావు ఆధ్వర్యంలో జరిగిన తరగతుల్లో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎస్ఆర్ శర్మ, ఏఈ ఆర్.భవాని, ఎంఈవో శారదాజ్యోత్స్న,సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


తాళ్లపూడిలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమణ

నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


విజయవాడ వెళ్తున్న వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 2047 నాటికి అభివృద్ధి చెందిన నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రభుత్వంతో పాటు ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ నెల 13న విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆవిష్కరణ విజన్-2047 కార్యక్రమానికి కొవ్వూరు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు, విద్యావేత్తలు వెళ్తున్న మూడు బస్సులను స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ముప్పిడి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు కష్టపడుతున్నారన్నారు. దానిలో భాగంగానే శుక్రవారం విజయవాడలో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంటు ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర శాశ్వత అభివృద్ధికి, సుసంపన్నమైన భవిష్యత్‌కు ఈ కార్యక్రమం దిశానిర్దేశం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు, నాయకులు పాల్గొన్నారు.

సేవా స్ఫూర్తితో మెలగాలి

ప్రతిఒక్కరూ సామాజిక సేవా స్ఫూర్తితో మెలగాలని ఎమ్మెల్యే ముప్పిడి అన్నారు. గ్లోబల్ పీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడ్ సమరిటన్-2024 పురస్కారాల కార్యక్రమం గురువారం కొవ్వూరులో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రైస్తవ సామాజికవేత్తలు పండు డేవిడ్‌రాజు, విప్పర్తి ఐజక్ న్యూటన్ పండు, చల్లగాలి సతీష్‌కుమార్, ఇజ్జన వినోద్‌కుమార్‌లకు పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా, కె.విజయ్‌కుమార్, జె.ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే స్థానిక వేగివారి చావిడిలో కొవ్వూరు రూరల్ అండ్ అర్బన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ ఫిలిప్ అధ్యక్షతన క్రిస్మస్ ఆరాధన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి విచ్చేశారు. రెవరెండ్ జోసఫ్‌బాబు దేశాబత్తుల, పాస్టర్లు పిటర్‌సన్, బెన్నిపాల్, జోసఫ్ దైవ సందేశాలను అందించారు. ఎమ్మెల్యేను అసోసియేషన్ సభ్యుడు బొంతా శ్యాం రవిప్రకాష్ సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, సంఘస్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో
అంతరాయం

కొవ్వూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరు 33/11 కేవీ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఎస్.నారాయణ అప్పారావు అన్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు దొమ్మేరు, దొమ్మేరు సావరం, కాపవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనునట్టు ఏఈ సీహెచ్. శ్రీనివాసరావు తెలిపారు.

తాళ్లపూడి: ప్రక్కిలంక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ తాళ్లపూడి, కుకునూరు, ప్రక్కిలంక, పైడిమెట్ట, పోచవరం, వేగేశ్వరపురం, పెద్దేవం, గజ్జరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు. రైతులకు ఉదయం 4గంటల నుంచి 8గంట వరకూ వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తామని ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు.

దేవరపల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దేవరపల్లి, బందపురం, అచ్చయ్యపాలెం, గొల్లగూడెం గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఏఈ సీహెచ్ వెంకట్రావు తెలిపారు. వ్యవసాయానికిచ్చే 3ఫేజ్ విద్యుత్ సరఫరా ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిలుపుదల చేయనున్నట్టు చెప్పారు.

ఆవపాడు నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు


ఆవపాడులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నల్లజర్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవపాడు గ్రామంలో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో 70 నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ గురువారం తెలిపారు. గ్రామంలో పాత విద్యుత్ స్తంభాల స్థానంలో ఎత్తుగా ఉన్న నూతన స్తంభాలను ఏర్పాటు చేసి త్రీఫేజ్ సరఫరా తీసుకుని వచ్చినట్టు పేర్కొన్నారు.

సెల్‌ఫోన్, నగదు చోరీ

కొవ్వూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్, నగదు దొంతనంపై కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం దేవలభద్ర గ్రామానికి చెందిన సరళన చిరంజీవులు ఈ నెల 12న కొవ్వూరు శివానంద పార్కు వద్ద ఉన్న సోదరుడి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ప్రవేశించి రెడ్‌మీ సెల్‌ఫోను, రూ.5వేల నగదు దొంగిలించుకుపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిన్నారులతో పనులు

తాళ్లపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులతో పనులు చేయిస్తున్న సంఘటన తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాలలో శుక్రవారం తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులకు పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను వ్యాన్‌లో వేయించే పనిని అప్పగించడంతో ఏమీ తెలియని ఆ చిన్నారులు మాత్రం ఉపాధ్యాయులు చెప్పిన పనిని పూర్తిచేశారు. ఆ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దృష్టికి తీసుకు వెళ్లగా తాను ఆఫీసు పనిలో బిజీగా ఉన్నానని చెప్పారు.



వివాహిత ఆత్మహత్య

కొవ్వూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో వివాహిత ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటనపై కేసునమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణంలోని 1వ వార్డు శ్రీరామకాలనీకి చెందిన నేతల వీరబాబు భార్య ఈ నెల 11వ తేదీ ఉదయం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి పోసుకుని మృతి చెందింది. వీరబాబు అందించిన సమాచారంతో మృతురాలి తండ్రి సికోలు అర్జునుడు కుటుంబ సభ్యులతో కొవ్వూరు చేరుకున్నారు. అర్జునుడు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.